అనుబంధాల ఆత్మీయ వేడుక రక్షాబంధన్ 6





వరలక్ష్మీ వైభవం



శ్రావణమాసంలో మూడో శుక్రవారం వచ్చిన వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటా వ్రతాన్ని ఆచరించడంతోపాటు ఆలయాలను సందర్శించారు. ముఖ్యంగా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అలాగే అమ్మవార్లకు ప్రత్యేకంగా అలంకరించారు. చిత్రాలు.. ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో మాణిక్యాంబ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శమిస్తున్న దృశ్యం.. ఆత్రేయపురంలో ఓ మహిళ వరలక్ష్మీ పూజ..

డిప్యూటీ తహశీల్దార్లు బదిలీ

అమలాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న ఆరుగురు డిప్యూటీ తహశీల్దార్లను వివిధ ప్రాంతాలకు బదిలీచేస్తూ ఇన్‌చార్జ్ డీఆర్వో కె.మాధవి ఉత్తర్వులు జారీచేశారు. ముమ్మిడివరంలో డిప్యూటీ తహశీల్దారుగా పనిచేస్తున్న సీహెచ్ జయకుమారిని అమలాపురంలో ఆర్డీవో కార్యాలయానికి బదిలీ చేశారు. అలాగే కాట్రేనికోన డిప్యూటీ తహశీల్దారు జగదీష్‌ను ముమ్మిడివరం తహశీల్దారు కార్యాలయానికి, ముమ్మిడివరం డిప్యూటీ తహశీల్దారు లలితను ఉప్పలగుప్తం తహశీల్దారు కార్యాలయానికి బదిలీ చేయగా, ఉప్పలగుప్తం తహశీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దారు జీవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, అయినవిల్లి తహశీల్దారు కార్యాలయానికి బదిలీ చేశారు. అదేవిధంగా ముమ్మిడివరం తహశీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.దుర్గాశ్రీనివాసులు రాజోలు తహశీల్దారు కార్యాలయానికి బదిలీచేస్తూ ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారిణి మాధవి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరిలో కలపాలి

మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి

రాయవరం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ప్రకటించిన 26 జిల్లాల ఏర్పాటులో ఆయా జిల్లాల కేంద్రాలు, పరిధి నిర్ణయంలో శాస్త్రీయత, హేతుబద్ధత లోపించి ప్రజలు అనేక ఇబ్బందులు, సమస్యలు ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి అన్నారు. శుక్రవారం మండలంలోని కూర్మాపురం గ్రామంలో మీడియాతో మాజీ ఎమ్మెల్సీ చౌదరి మాట్లాడుతూ జిల్లాల పరిధి నిర్ణయంలో పరిపాలనా సౌలభ్యంతోపాటు ప్రజాభీష్టం, ప్రజల సౌకర్యం, భౌగోళిక, నైసర్గిక స్వరూపం, దూరభారాలు, మౌలిక అంశాలు పరిగణలోకి తీసుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఈ నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో ఉన్న మండపేట నియోజకవర్గాన్ని (మండపేట టౌన్, మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాలను) రాజమహేంద్రవరం జిల్లా కేంద్రంగా ఏర్పడిన తూర్పుగోదావరిలో జిల్లాలో విలీనం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి మాజీ ఎమ్మెల్సీ విజ్ఞప్తి చేశారు. మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరిలో కలపాలని కోరుతూ ముఖ్యమంత్రితోపాటు, మంత్రులు నాదెండ్ల మనోహర్, నిమ్మల రామానాయుడు, పొంగూరు నారాయణకు వినతిపత్రం అందజేసినట్టు మాజీ ఎమ్మెల్సీ చౌదరి తెలిపారు.

యానాం ఎస్పీగా చింతాకు అదనపు బాధ్యతలు

యానాం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): యానాం పోలీస్ ఎస్పీగా యానాంకు చెందిన పీపీఎస్ అధికారి చింతా కోదండరామ్‌ను నియమిస్తూ పుదుచ్చేరి పోలీస్‌శాఖ ఉత్తర్వులు జారీచేసింది. పుదుచ్చేరి రాష్ట్రవ్యాప్తంగా పలువురు అధికారులకు అదనపు బాధ్యతలను అప్పగించింది. దీనిలోభాగంగా పుదుచ్చేరి పీపీ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న కోదండరామ్‌కు యానాం ఎస్పీగానూ అదనపు బాధ్యతలను అప్పగించారు. మరో రెండు రోజుల్లో ఆయన యానాం రానున్నారు.



నాచుతో.. ఉపాధి!

- ఉప్పునీటి ద్వారా సముద్రపు నాచు తయారీ
- పైలెట్ ప్రాజెక్టుగా కరవాక ఎంపిక
- తమిళనాడు శాస్త్రవేత్తల బృందం పర్యటన
- తీర ప్రాంత గ్రామాల్లో అనువైన ప్రదేశాల గుర్తింపు
- మత్స్యకార యువత, మహిళా సంఘాలకు ఉపాధి

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

బంగాళాఖాతం సముద్ర తీరంలో ఉప్పునీటి జలాల ద్వారా సముద్రపు నాచు ఉత్పత్తికి ప్రభుత్వం ప్రయోగాత్మక ప్రాజెక్టులను చేపట్టింది. దీనిలో భాగంగా తొలిసారి మామిడికుదురు మండలం కరవాక సముద్ర తీరంలో పైలెట్ ప్రాజెక్టుగా సముద్రపు నాచు ఉత్పత్తికి శ్రీకారం చుట్టింది. దీనిద్వారా మత్స్యకార ప్రాంతానికి చెందిన యువత, మహిళలు ఉపాధి మార్గాలు మెరుగుపడతాయనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టులపై అధికార యంత్రాంగం దృష్టిపెట్టింది. అంతర్వేది నుంచి హోప్‌ఐలాండ్ వరకు ఉన్న సుమారు 93 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతంలో 12కు పైగా తీర ప్రాంత గ్రామాలను సముద్రపు నాచు ఉత్పత్తికి అనువైన ప్రాంతాలుగా ఇటీవల ప్రత్యేక నిపుణుల బృందం పరిశీలించింది. తమిళనాడులోని మండపం ప్రాంతానికి చెందిన సీఎస్ఎంసీఆర్ఐలో సముద్రపు నాచు ఉత్పత్తుల పరిశోధనలో కీలకంగా ఉన్న పనిచేసే శాస్త్రవేత్త డాక్టర్ సతీష్ ఆధ్వర్యంలోని శాస్త్రవేత్తలతోపాటు జిల్లాలోని మత్స్య, అటవీ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో ఒక బృందం కోనసీమలోని తీర ప్రాంతాల్లో పర్యటించింది. ఈ నేపథ్యంలో మామిడికుదురు మండలం సముద్ర తీరమైన కరవాకలో పైలెట్ ప్రాజెక్టు ద్వారా సముద్రపు నాచు తయారీని ఇటీవల శాస్త్రవేత్తల పర్యవేక్షణలో ప్రారంభించారు. ప్రస్తుతం వివిధ దశల్లో నాచు ఉత్పత్తి కొనసాగుతోంది.



సముద్ర తీరంలో నాచు తయారీకి అనువైన ప్రదేశాల కోసం ఇటీవల కోనసీమ తీరంలో పర్యటించిన తమిళనాడులోని మండపానికి చెందిన శాస్త్రవేత్తల బృందం



మామిడికుదురు మండలం కరవాకలో సముద్రపు నాచు తయారీ పైలెట్ ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్ (ఫైల్‌ఫొటో)

ఎంపిక చేసిన తీర ప్రాంతాలు

సముద్రపు నాచు ఉత్పత్తి తయారీకి అనువైన ప్రదేశాలను శాస్త్రవేత్తల బృందం ఇటీవల పరిశీలించింది. కాట్రేనికోన మండలంలోని కొత్తపాలెం, పల్లం, నీళ్లరేవు, చిర్రయానం, గచ్చకాయలపొర, ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లి, ఎస్.యానం, వాసాలతిప్ప, మామిడికుదురు మండలంలోని గోగన్నమఠం, కరవాక, గొల్లపాలెం, తూర్పుపాలెం, సఖినేటిపల్లి మండలంలోని చింతలమోరి, కేశవదాసుపాలెం, అంతర్వేది, గొంది, అల్లవరం మండలంలోని కొమరగిరిపట్నం, ఎస్.రామేశ్వరం, రెబ్బనపల్లి, ఓడలరేవు తదితర గ్రామాలను పరిశీలించిన అధ్యయన బృందం ఏడు నుంచి ఎనిమిది ప్రాంతాల్లో నాచు ఉత్పత్తికి అవసరమైన స్థలాలను కూడా పరిశీలించారు. ప్రస్తుతం మామిడికుదురు మండలం కరవాకలో నాచు తయారీ పైలెట్ ప్రాజెక్టులో నాచును ఉత్పత్తి చేస్తున్నారు. ఉప్పునీరు లభ్యమయ్యే తీర ప్రాంతంలో సముద్ర జీవన వైవిధ్యం పెంపు, పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర వహించేందుకు వీలుగా సముద్రపు నాచుసాగు వల్ల తీర గ్రామాల ప్రజలకు అధిక ఆదాయం వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

సాగు చేయనున్న నాచు జాతులు

కప్ప ఫైకస్ అల్వారెజీ అనే నాచు ద్వారా కేరాజీనన్ అనే పదార్థాన్ని తీస్తారు. ఇది ఆహార పదార్థాలు, ఔషధాలు, సౌందర్య సాధనాలతో స్థిరపరిచే పదార్థంగా వినియోగిస్తారు. అలాగే గ్రాసిలేరియా ఎడ్యులిస్ అనే నాచు ద్వారా అగర్ అనే పదార్థాన్ని తయారు చేస్తారు. ఇది మైక్రో బయాలజీ ల్యాబ్‌లు, ఆహార పరిశ్రమ, ఔషధ తయారీలో ఉపయోగిస్తారు. ఈ రెండు జాతులు కూడా పంటల సాగులో రసాయనిక ఎరువులకు ప్రత్యామ్నాయంగా పంటల వృద్ధిని పెంచే సహజ ఉత్పత్తులైన జీవవృద్ధి ఉద్దీపకాలు (బయో స్టిమిలెంట్)గా ఉపయోగిస్తారు.

ఆదాయ, పర్యావరణ ప్రయోజనాలు

సముద్రపు నాచుసాగు తీరప్రాంత ప్రజలకు స్థిరమైన ఆదాయాన్ని కల్పిస్తుంది. ఈ సాగుకు లబ్ధిదారులను ఎంపిక చేసే బాధ్యతను డీఆర్డీఏ మత్స్యశాఖ ఆధ్వర్యంలో స్వయం సంఘాల మహిళలు, మత్స్యకారులు, యువకుల్లో ఔత్సాహికులైన వారిని గుర్తించి శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించారు. ప్రాజెక్టుకు గ్రీన్ క్లైమేట్ ఫండ్, నాబార్డు నిధులు సమకూర్చనున్నాయి. ప్రాజెక్టును కోనసీమలో అమలు చేసేందుకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధ్యయన బృందాలను నెల్లూరు జిల్లాకు కూడా పంపారు.



అంబాజీపేటలో జాతీయ నులిపురుగుల నివారణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం (ఫైల్‌ఫొటో)

నులి పురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లాలో 12న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం
- మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి
- 20వ మిగిలిన పిల్లలకు పంపిణీ

అంబాజీపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రక్తహీనతలను, పోషకాహార లోపాన్ని నివారించాలన్న లక్ష్యంతో నీతి అయోగ్ రూపొందించిన జాతీయ పోషకాహార విధానంలో భాగంగా అనీమియాముక్తభారత్, కుపోషన్ ముక్త భారత్ లక్ష్యాలను సాధించేందుకు జాతీయ నూలి పురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించబోతున్నారు. నెలల వయస్సు వారి నుంచి వృద్ధుల వరకు నులి పురుగులు ఇబ్బందులు పెడుతుంటాయి. పొట్టలోకి సులువుగా చేరి హాని కలిగిస్తాయి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే వారిలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. ఏటా రెండుసార్లు నులిపురుగుల నివారణ కోసం మాత్రలను ఇస్తుంటారు. దీనికి సంబంధించి జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి ఎం.దుర్గారావు దొర పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇప్పటికే ఆయా వైద్య సిబ్బందికి వీటిపై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. ఈ నెల 12వ తేదీన జిల్లాలోని రెండేళ్ల నుంచి 19 ఏళ్లలోపు వారందరికీ అంగన్‌వాడీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, హైస్కూల్స్, జూనియర్ కళాశాలల్లో ఉన్న విద్యార్థులకు అల్బెండ్‌జోల్ మాత్రలను పంపిణీ చేయనున్నారు.

వైద్యుల సూచనలు పాటించాలి..

కంటికి కనిపించినంత పరిమాణంలో ఉండే నులి పురుగులు మనం తీసుకునే ఆహారం ద్వారానే పొట్టలోకి చేరతాయి. తీపి పదార్థాలు, జంక్‌ఫుడ్ తినే వారిలోనూ, కలుషిత నీరు తీసుకోవడం, జీర్ణక్రియ సక్రమంగా లేకపోవడంతో నులిపురుగులు వచ్చే అవకాశం ఉంది. పిల్లలు మట్టిలో ఆడుకుంటే చేతుల్లో చేరిపోతాయి. చేతులను శుభ్రం చేసుకోకపోతే పొట్టలోకి చేరి అభివృద్ధి చెందుతాయి. దీంతో బక్కచిక్కి, రక్తహీనతతో బాధపడతారు. ఎంత తిన్నా బరువు పెరగరు. అందుకే పిల్లలు వీలైనంతా ఎక్కువగా పీచు పదార్థాలు తీసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

రుగ్మతలు.. నివారణ చర్యలు

నులి పురుగులు ఉంటే రక్తహీనత, శరీరం తెల్లగా పాలిపోవడం, చేతులు, కాళ్లలో విపరీతమైన దురద వస్తుంది. దేహంపై ఎక్కడైనా చర్మం మీద అలర్జీ వచ్చే అవకాశం ఉంటుంది. మనిషి బాగా నీరసించిపోవడం, నిస్సహాయంగా ఉండటం, కళ్లు తిరిగివడిపోవడం వంటి జరుగుతాయి. భోజనానికి ముందు తర్వాత చేతులు పరిశుభ్రంగా చేసుకోవాలి. బహిరంగా మల విసర్జనకు వెళ్లకుండా వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి నులిపురుగులు నివారణ మాత్రలు తప్పకుండా తీసుకోవాలి.





గోదావరి తగ్గినా.. ఇబ్బందే!

- నాటు పడవలపైనే లంక గ్రామాల ప్రజల రాకపోకలు
- నీటి ఉధృతి లేకపోవడంతో అనేక అవస్థలు

గంటిపెదపూడి శివారు బూరుగులంక నదీపాయను నాటుపడవపై దాటుతున్న లంకగ్రామస్తులు.. పడవ ఎక్కడానికి అవస్థలు

పి.గన్నవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గోదావరికి వరదపోటు తగ్గినప్పటికీ స్థానిక ప్రజానీకానికి ఇంకా అవస్థలు మాత్రం తప్పడంలేదు. గోదావరి ఎగువ ప్రాంతంలో వరద ఉధృతి తగ్గడంతో దిగువన ధవళేశ్వరం బ్యారేజీ నుంచి వచ్చే మిగులు జలాల ఉధృతి తగ్గింది. దాంతో కోనసీమ జిల్లాలో ప్రవహించే గౌతమి, వృద్ధగౌతమి, వశిష్ఠ, వైన తేయ నదీపాయల్లో వరద ప్రవాహం బాగా తగ్గిపోయింది. లంకగ్రామాలకు వెళ్లేవారు గోదావరి నిండుగా ప్రవహిస్తే ఇంజన్ బోట్లపై ప్రయాణం చేసేవారు. ప్రస్తుతం నీటి ఉధృతి తగ్గి నదీపాయలో ఇంజన్ బోట్లు తిరిగే అవకాశం లేకపోవడంతో నాటు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. గంటిపెదపూడి శివారు బూరుగులంక నదీపాయలో వరద ఉధృతి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో బూరుగులంకతోపాటు పెదపూడిలంక, అరిగెలవారిపేట, ఉడిమూడిలంక గ్రామస్తులు నాటుపడవలపైనే విద్యార్థులు, రైతులు, స్థానిక ప్రజానీకం రాకపోకలు సాగిస్తున్నారు. గోదావరి మరింత తగ్గితే నాటు పడవలు సైతం తిరిగే అవకాశం ఉండదని, కాలినడకనే అవతలి ఒడ్డుకు చేరుకోవల్సిన పరిస్థితి వస్తుందని స్థానిక ప్రజానీకం చెబుతున్నారు. అలాగే పశ్చిమ గోదావరి జిల్లా గ్రామాలైన అనాగర్లంక, పెదమల్లంక, అయోధ్యలంక గ్రామస్తులు నాటు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. ఇదిలాఉండగా గోదావరిలో వరద ప్రవాహం కారణంగా పి.గన్నవరం అక్విడెక్టుపై నుంచి స్థానికులు పండుగొప్ప చేపల వేట నిమిత్తం గేలాలు కాస్తుండడంతో సందడిగా మారింది.



నాడంతా ఇష్టారాజ్యంగా

ఇష్టారా.. ఏలాగని!

సీనరేజి కాంట్రాక్టుకు ముమ్మర పైరవీలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొండలు, గుట్టలు, గ్రావెల్,క్వారీలు ఉన్న ప్రతి చోటా సదరు సంస్థ సొంతంగా మనుషులను నియమించి, మైనింగ్ ఏరియాలో సీసీ కెమెరాలు బిగించి సొంత రసీదులతో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. ఎవరు ఏ చిన్న మట్టి,గ్రావెల్ తవ్వుకున్నా ముక్కుపిండి సీనరేజి వసూలు చేసింది. ప్రత్తిపాడు,తుని నియోజకవర్గాల్లో వందలాది క్వారీల నుంచి నల్లరాయి ఇతర జిల్లాలకు ఎగుమతవగా, ఆ లారీల నుంచి ఒక్క రూపాయి వదల కుండా ముక్కుపిండి నెలనెలా కోట్లలో డబ్బులు పిండేసింది.ప్రభుత్వానికి నెలకు కట్టాల్సిన రూ.9.70 కోట్లకు బదులు రూ.15 కోట్లకు పైగా వసూలు చేసింది.ఈ కంపెనీకి గత నెల 13తో సీనరేజీ వసూలు కాంట్రాక్టు రద్దయిపోయింది.పోతూపోతూ సదరు కంపెనీ ప్రతినిధులు ఉమ్మడి జిల్లాలో బిల్లులు లేకుండా నేరుగా నగదు వసూళ్లకు దిగింది. దీంతో రౌతులపూడి, కోనసీమ జిల్లాల్లో జనం తిరగబడ్డారు.

- సీనరేజీ కాంట్రాక్టుపై అయోమయం
- గత నెల 13న ముగిసిన గడువు
- తప్పుకున్న సుధాకర్ ఇన్‌ఫ్రా
- తిరిగి టెండర్ల ద్వారా కొత్త కంపెనీ
- మళ్లీ చాన్స్‌కు పాత కంపెనీ పావులు
- కాంట్రాక్టు పొడిగించేలా పైరవీలు
- గత వైసీపీలో రూ.233 కోట్లు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో సీనరేజి వసూళ్ల కాంట్రాక్టు గడువు ముగియడంతో మళ్లీ దక్కించుకునేందుకు సుధాకర్ ఇన్‌ఫ్రా పావులు కదుపుతోంది. గత నెల 13వ తేదీతో కాంట్రాక్టు రద్దవడంతో తిరిగి వర్క్ ఆర్డరు తెచ్చుకునేందుకు పైరవీలు ముమ్మరం చేసింది. గత వైసీపీ హయాంలో అడ్డగోలుగా ఈ కంపెనీకి జగన్ సర్కారు రెండేళ్లపాటు సీనరేజీ వసూలు కాంట్రాక్టు కట్టబెట్టేసింది. దీంతో ఎక్కడికక్కడ ముక్కుపిండి సీనరేజీ వసూళ్లు చేసి కోట్లకు కోట్లు లాభాలు ఆర్జించారు. అయితే గడువు ముగియడంతో సదరు సంస్థ తిరిగి మళ్లీ దక్కించుకునేందుకు తెగ ప్రయత్నాలు చేస్తోంది. ప్రభుత్వం టెండర్లు పిలిస్తే కాంట్రాక్టు దక్కుతుందో లేదోనన్న అనుమానంతో ముందే పైరవీలకు దిగుతోంది. నెల్లూరుకు చెందిన సదరు కాంట్రాక్టరు ఇప్పటికే గనుల శాఖకు రూ.25 కోట్ల వరకు బాకీ పడ్డారు.అధికారులు ఒత్తిడి తెచ్చినా కట్టలేదు.మరో పక్క ఇటీవల కాంట్రాక్టు గడువు ముగుస్తోన్న సమయంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సదరు కంపెనీ ప్రతినిధులు బిల్లులే లేకుండా నేరుగా నగదు వసూలు చేయడం వివాదాస్పదమైంది.

అప్పట్లో అప్పనంగా కొట్టేసి...

ఉమ్మడి జిల్లాలో భారీ నల్లరాతి కొండలు, గ్రావెల్, మట్టి,లేటరైట్ తవ్వకాలకు అనుమతులివ్వడం ద్వారా ఏటా కోట్లలో ఆదాయం ప్రభుత్వానికి సమకూరుతోంది. ప్రత్తిపాడు, తుని, పెద్దాపురం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, సీతానగరం, పి.గన్నవరం, రాజోలు, ముమ్మిడివరం తదితర నియోజకవర్గాల్లో క్వారీ, గ్రావెల్, మట్టి తవ్వకాల ద్వారా గనుల శాఖకు అధిక రాబడి వస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గనుల శాఖకు ఏటా రూ.407 కోట్ల వరకు రాబడి వచ్చేది. గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు దీనిపైనే కన్నేశారు. చిన్న తరహా ఖనిజాల సీనరేజి వసూలు బాధ్యత నుంచి గనుల శాఖను పక్కన పెట్టి మూడో కంటికి తెలియకుండా మొట్టమొదటిసారిగా సుధాకర్ ఇన్‌ఫ్రా అనే ప్రైవేటు కంపెనీకి కట్టబెట్టేశారు. 2023 ఏప్రిల్ నుంచి 2025 ఏప్రిల్ వరకు రెండేళ్లపాటు ఇచ్చారు. రెండేళ్లకు కలిపి కేవలం ప్రభుత్వానికి రూ.233 కోట్లు చెల్లిస్తే చాలని షరతు విధించారు. అది కూడా నెలకు రూ.9.70 కోట్ల చొప్పు న 24 వాయిదాల్లో చెల్లించే వెసులుబాటు ఇచ్చారు. భారీగా ఆదాయం పిండాల్సిన చోట కారుచౌకగా కట్టబెట్టేసి తెరవెనుక అప్పటి ప్రభుత్వ పెద్దలు కోట్లలో నొక్కేశారు.

మళ్లీ మాకే దక్కాలి...

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో సీనరేజీ కాంట్రాక్టు రద్దయి 25 రోజులు అవుతోంది. దీంతో తిరిగి ప్రభుత్వం కొత్తగా టెండర్లు పిలిచి సీనరేజీ వసూలు అర్హత గల కంపెనీకి కట్టబెట్టాలి. అయితే ఇంకా కసరత్తు మొదలవలేదు. ఇటీవల ప్రభుత్వం కొన్ని ఉమ్మడి జిల్లాలకు కొత్తగా సీనరేజీ వసూళ్లకు ప్రైవేటు సంస్థలను ఆహ్వానిస్తూ టెండర్లు పిలిచింది. గడువు ముగిసిన జిల్లాలకు ఇంకా టెండర్లు పిలవలేదు. త్వరలో వీటిని జారీ చేసే అవకాశం ఉంది. కొత్త కంపెనీ ఖరారయ్యే వరకు ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో గనులశాఖ సీనరేజీ వసూలు చేస్తోంది. ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు స్వీకరిస్తోంది. ఈ క్రమంలో అసలు ఎవరు చెల్లిస్తున్నారు? ఎవరు చెల్లించకుండా ఖనిజాలను తరలిస్తున్నారనేది గనులశాఖ అసలు పట్టించుకోవడం లేదు. మరో పక్క కొత్త టెండర్లు పిలిస్తే పోటీ పెరిగి తనకు కాంట్రాక్టు దక్కదనే ఆందోళన సుధాకర్ ఇన్‌ఫ్రాను వేధిస్తోంది.గత వైసీపీ హయాంలో ఉమ్మడి జిల్లా సీనరేజీ వసూలు కాంట్రాక్టును తెర వెనుక లాలూచీతో రెండేళ్లకు కేవలం రూ.233 కోట్లే చెల్లించేలా కారుచౌకగా కొట్టేసింది.ఇప్పుడు కొత్తగా టెండర్లు పిలిస్తే ప్రభుత్వానికి చెల్లించాల్సిన సీనరేజీ డబ్బులను భారీగా పెంచాలి. దాదాపు రెట్టింపుస్థాయిలో అయినా బిడ్ అమౌంట్ పెంచాల్సి ఉంటుందని అధికారులే చెబుతున్నారు. తద్వారా ఖజానాకు ఆదాయం పెరుగుతుంది. సదరు కాంట్రాక్టరు మాత్రం టెండర్ల వరకు వెళ్లకుండా మళ్లీ పాత ధరకే కారుచౌకగా వసూళ్ల కాంట్రాక్టు కొట్టేయాలని ప్రయత్నం చేస్తున్నారు.

బకాయి రూ.25 కోట్లు

సదరు కాంట్రాక్టరు ప్రభుత్వానికి రూ.25 కోట్ల వరకు బాకీ పడ్డారు. గత వైసీపీ హయాంలో రౌతులపూడిలో అరబిందో సంస్థ నిర్మించే కొత్త పోర్టు కోసం భారీ నల్లరాయి కొండను కేటాయించారు.ఇందుకోసం ఆ కంపెనీ ప్రభుత్వానికి సీనరేజీ కట్టాల్సి ఉంది. కానీ అరబిందో కోసం జగన్ సర్కారు ఒక్క రూపాయి కూడా సీనరేజీ గనులశాఖకు కట్టక్కర్లేకుండా రూ.20 కోట్ల వరకు మినహాయింపు ఇచ్చేసింది. అరబిందో కోసం రద్దు చేసిన సీనరేజీ వల్ల తన రాబడి తగ్గిపోయిందని రూ.20 కోట్ల సీనరేజీ డబ్బులో కొంత వాటా తన పాత బకాయిలకు సర్దుబాటు చేయాలంటూ అప్పట్లో గనులశాఖను సదరు సుధాకర్ ఇన్‌ఫ్రా కోరింది.ఈలోపు ఎన్నికలు వచ్చేయడంతో సదరు కాంట్రాక్టర్ అనుకున్న పనికాలేదు. ఈలోపు ప్రభుత్వం మారడంతో అధికారులేమో సర్దుబాటు కుదరదని, డబ్బులు చెల్లించాలని తెగేసి చెప్పారు. అయినా ఇంకా ఈ సంస్థ బాకీలు చెల్లించ లేదు. తిరిగి నష్టపోయానంటూ ఇప్పుడు కొత్తగా కాంట్రాక్టు కొట్టేయడానికి పావులు కదుపుతోంది.

ప్రకృతి..ఆకృతి!





ఎన్నెన్నో అందాలు.. అన్నింటా వర్ణాలు.. అని ఒక కవి అన్నారు.. అది నిజమే.. ఈ చిత్రాలే చూడండి.. ప్రకృతి మనకు ఎంతో ఇవ్వడమే కాదు.. ఎంతో నేర్పింది కూడా.. ఇవి ప్రకృతి గీసిన రక్షాబంధన్ ఆకృతి.. రాఖీ పండుగ రోజున సోదర ప్రేమను తెలుపుతూ రాఖీలు కడుతుంటారు. విలువైన కానుకలు ఇచ్చి సోదరులు వారి సోదరీమణుల పట్ల ఆత్మీయత చూపుతారు. ప్రస్తుతం ట్రెండ్ మారింది. తమ సోదరులు పదికాలాలు పచ్చగా ఉండాలని.. మొక్క వలే రోజురోజుకీ అభివృద్ధి చెందాలని ఇటీవల కాలంలో మొక్కలు ఇచ్చిపుచ్చుకునే సాంప్రదాయం వచ్చింది. ప్రస్తుతం కడియం నర్సరీలో లభించే ఈ రాఖీ పుష్పాలు అనేక రంగుల్లో లభ్యమవుతున్నాయి. మంచి పరిమాణంలో పువ్వు, దాని చుట్టూ రేఖలు ఉండి అందంగా ఉండే ఈ రాఖీ పుష్పం పేరు ప్యాసీ ఫ్లోరా అంటారు. దీనిని కౌరవులు-పాండవులు మొక్క అని కూడా పిలుస్తారు.

- కడియం

శ్రీపాదుడే.. సోదరుడు



శ్రీపాద శ్రీవల్లభుడికి రాఖీలు కట్టేందుకు తరలివచ్చిన మహారాష్ట్ర, ఉత్తరాది భక్తులు



పిఠాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీపాదుడిని సోదరుడిగా భావించే మహారాష్ట్ర, ఉత్తరాది రాష్ట్రాల భక్తులు శ్రావణ (రాఖీ) పౌర్ణమికి ముందుగానే ఆయన జన్మ స్థలమైన కాకినాడ జిల్లా పిఠాపురం తరలివచ్చారు. దీంతో హోటళ్లు, లాడ్జీలు, ప్రైవేటు అతిథిగృహాలు కిటకిటలాడుతున్నాయి. శ్రీపాద శ్రీవల్లభులకు వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారు శ్రావణి పౌర్ణమి రోజున రాఖీ కట్టడంతో ఈ రోజుకు విశేష ప్రాధాన్యం ఉంది. అదే సమయంలో మహారాష్ట్ర, ఉత్తరాది భక్తులు తమ ఇంట ఇలవేల్పుగా కొలిచే శ్రీపాద శ్రీవల్లభుడిని సోదరుడిగా భావిస్తారు. దీంతో రాఖీ (శ్రావణ లేదా జంధ్యాల) పౌర్ణమికి మహారాష్ట్ర, గోవా, ఉత్తరాది, ఏపీ, తెలంగాణ, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గుజరాత్, బెంగాల్, ఒడిసా, ఢిల్లీ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానానికి భారీగా తరలివచ్చారు. వారంతా నాలుగైదు రోజులు ఇక్కడే ఉండి పూజల్లో పాలుపంచుకుంటారు. రాఖీ రోజున సాధారణంగా మహిళలు తమ సోదరులకు రాఖీలు కట్టి వారి ఆశీస్సులు పొందుతారు. అందుకు భిన్నంగా మహారాష్ట్ర, ఉత్తరాది రాష్ట్రాల భక్తులు మాత్రం శ్రీపాద శ్రీవల్లభులు, ఈ క్షేత్రంలో ఉన్న ఔదుంబర వృక్షానికి రాఖీలు కడతారు. శ్రావణి పౌర్ణమి రోజున రాఖీలు కట్టడం ద్వారా శ్రీపాదుని ఆశీస్సులు లభిస్తాయని భక్తుల నమ్మకం. రాఖీ పౌర్ణమి సందర్భంగా శనివారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు పలు ప్రత్యేక పూజలు, పల్లకీ సేవ, అభిషేకాలు జరుగుతాయి. మహా సంస్థానానికి తరలివచ్చే భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తెలిపారు. పాదగయ క్షేత్రంలో స్వయంభూగా వెలసిన దత్తాత్రేయ స్వామికి, ఆవరణలో ఉన్న అలక్‌నిరంజన్ దత్త బృందావనంలో పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరగనున్నాయి. సాయంత్రం పల్లకీ సేవ, పుష్పార్చన జరుగుతాయి. స్వయంభూ దత్తాత్రేయ స్వామికి లక్ష మల్లెల అర్చన జరుపుతామని ఈవో ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ చెప్పారు.



అడవి ఒడి.. బతుకు బడి..



ఈ ఒక్క చిత్రంచాలు.. ఆదివాసీల జీవన చిత్రం వివరించడానికి.. ఇది వారి నివాసం.. ఇదే వారి ఆవాసం.. పైన తాటాకులతో చిన్న కప్పు తప్ప.. గోడల్లేవ్.. మేడల్లేవ్.. చివరికి గచ్చుల్లేవ్.. నాటికి.. నేటికీ ఇదే వారి జీవనవిధానం.. ఏళ్లు గడచిపోతున్నాయి.. అయినా నేటికీ అలాగే ఉన్నారు.. ప్రభుత్వాలు మార్చలేకపోతున్నాయి..

ఎంతో అభివృద్ధి చెందాం.. ఎన్నో సాధించాం.. అని జబ్బలు చరుచుకుంటాం.. ఒకసారి అడవి లోకి వెళ్లి ఆదివాసీలను చూస్తే.. మన సాధించింది ఏమిటో అర్థమైపోతోంది..ఎందుకంటే పూర్వం ఎలా ఉన్నారో నేటికీ అలాగే ఉన్నారు.. ఎక్కడా మార్పులేదు.. ప్రభుత్వాలు చట్టాలు చేస్తున్నా.. పథకాలు ప్రకటిస్తున్నా అవేం వారి చెంతకు చేరడంలేదు.. నేడు ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

మారని ఆదివాసీల బతుకు తీరు

- దరిచేరని పథకాలు..అందని ఫలాలు
- అభివృద్ధికి దూరంగా తండాలు
- హక్కుల కోసం పోరాటాలు
- నేడు ఆదివాసీ హక్కుల దినోత్సవం

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

ఓ ప్రత్యేక సంప్రదాయం.. సంస్కృతి.. ఆచారం వారిది..వారి జీవనమంతా జల్ జంగిల్ జమీన్‌పైనే. ఆ మేరకే వారి ఆవాసాలు ఉంటాయి.వారే మూలవాసులుగా పిలవబడే ఆదివాసీలు. కాల క్రమంలో ఆదివాసీలు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అడుగు మోపుతున్నప్పటికి ఆ సంఖ్య పరిమితమే. అందుకే రాజ్యాంగంలోని ఐదు,ఆరవ షెడ్యూల్‌లో వారి కంటూ ఓ ప్రత్యేక చట్టాలు, హక్కులు కల్పించబడ్డాయి.అయితే ఆ ఫలాలు తమకు సంపూర్ణంగా అందడం లేదన్నది వారి వాదనగా ఉంది. అభివృద్ధి పేరిట తమ మనుగడకే ముప్పు వాటిల్లుతోందన్న ఆవేదన వినిపిస్తోంది. 1994లో ఐక్యరాజ్య సమితి ఆదివాసీల జీవన స్థితిగతులపై ఓ అధ్యయనం చేసింది. ఇందులో భాగంగా ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకై ప్రతి ఏడాది ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జరుపుకోవాలని తీర్మానించింది. అప్పటి నుంచి ఆగస్టు 9న ఆదివాసీ ప్రాంతాల్లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఒక వేడుకలా జరుపుకుంటున్నారు. అయితే హక్కుల సాధన, మనుగడ కోసం ఆదివాసీ సంఘాలు అలుపెరగని పోరాటం చేస్తూనే ఉన్నాయి. ఖనిజ సంపద వెలికి తీసినా, నీటి ప్రాజెక్టులు నిర్మించతలపెట్టినా చివరకు అక్కడ ఆదివాసీలే నిర్వాసితులుగా మారాల్సిన పరిస్థితి ఉంది. మన రాష్ట్రంలో పోలవరం, ఛత్తీస్‌గఢ్, ఒడిస్సాలలో ఖనిజ వెలికితీత ప్రదేశాలే ఇందుకు ఉదాహరణ. దీంతో తమ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతోందని ఆదివాసీ నాయకులు మొర పెట్టుకుంటున్నారు. హక్కుల సాధనకు పోరాటాలు చేయడంతోనే తమ జీవితాలు తెల్లారిపోతున్నాయంటున్నారు.దేశం మొత్తం మీద తొమ్మిది కోట్ల మంది జనాభా కలిగి ఉన్న ఆదివాసీల పండుగలను సైతం ప్రభుత్వాలు గుర్తించక పోవడం విడ్డూరం. చివరకు ఆదివాసీ సంతతి తమ మాతృభాషను సైతం మర్చిపోయే ప్రమాదం పొంచి ఉందంటున్నారు. తమ భాష పరిరక్షణలో భాగంగా మన్యంలో ప్రాథమిక విద్య ఆదివాసీ మాతృ భాషలో బోధించాలని పట్టుపడుతున్నారు. ఇది కొంతమేర ఆచరణలోకి వచ్చి ఆ తర్వాత ఆ తరహా బోధన పరిమితమైంది.

వలస ఆదివాసీలది మరో వేదన

మన రాష్ట్రంతో పాటు తెలంగాణ రాష్ట్రాలకు ఛత్తీస్‌గఢ్ నుంచి పలు ఆదివాసీ కుటుంబాలు వలస వచ్చాయి. వారిలో అధికులు రిజర్వు ఫారెస్టునే తమ ఆవాసాలుగా ఎంచుకున్నారు. ఆ క్రమంలో ఎన్నో కష్టాలు పడ్డారు. జైళ్ల పాలయ్యారు. కాల క్రమంలో తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు ఆధార్, రేషన్, ఓటు హక్కులను కల్పించాయి. తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసి పాఠశాలలు ఏర్పాటు చేశాయి. చట్టంలోని నిబంధనల మేరకు వారికి కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చే అవకాశం లేకుండాపోయింది. దీంతో వలస ఆదివాసీ సంతతి చదువులు అర్ధంతరంగా నిలిచిపోతున్నాయి. పౌష్టికాహారం అందక ఆ చిన్నారులు వ్యాధుల బారిన పడుతున్న సంఘటనలు చాలానే ఉన్నా యి. ఛత్తీస్‌గఢ్‌లో వీరంతా మురియా తెగకు చెం దిన వారుగా ఉన్నారు. తెలంగాణలోని ఖమ్మం, వరంగల్,మన రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాలో దాదాపు ఈ తరహా కుటుంబా లు 20 వేల పైచిలుకే ఉన్నాయన్నది ఓ అంచనా.



మనకు కుళాయిలు వచ్చాయి.. మరి ఆదివాసీలకో నేటికీ.. నీటికి వారి శ్రమే ఆధారం..



యానాంలో వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారిని రూ.23 లక్షల కరెన్సీతో ధాన్యలక్ష్మిగా అలంకరించిన దృశ్యం



కాకినాడ జిల్లా అన్నవరంలో వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారిని రూ.3 లక్షల కరెన్సీతో ధాన్యలక్ష్మిగా అలంకరించిన దృశ్యం

వరలక్ష్మీ వైభవం



రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో బాలాత్రిపురసుందరి అమ్మవారు

శ్రావణ మాసం మూడో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పలు ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపి అర్చకులు విశేష అలంకరణ చేశారు. వివిధ రూపాల్లో అమ్మవార్లను భక్తులు దర్శించుకుని పునీతులయ్యారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మహాలక్ష్మీదేవికి నెమలి పింఛాలతో అలంకరణ



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఏవీ అప్పారావు రోడ్డులో పుష్పాలంకరణలో సంతోషిమాత అమ్మవారు

అనుబంధాల ఆత్మీయ వేడుక రక్షాబంధన్



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

రాఖీ పండగంటే.. రాఖీ కట్టడం, రాఖీ కట్టించుకోవడం కాదు.. గిఫ్టులు ఇవ్వడం ఏ మాత్రం కాదు.. అక్క-తమ్ముడు, అన్న-చెల్లెలు మధ్య అనుబంధం చాటుకోవాలి. ఆ బంధం జీవితాంతం కొనసాగేలా భరోసానివ్వాలి. ముఖ్యంగా అన్నతమ్ముళ్లు తమ అక్కచెల్లెమ్మల కోసం వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలి. అప్పుడే ఆ బంధానికి విలువ.. ఆ ఆత్మీయ వేడుక జీవితంలో మధురానుభూతి నింపాలి.

మారుతున్న కాలానికి అనుగుణంగా రక్షణగా నిలవడం అనే పదానికి విస్తృతి పెరిగిందనే చెప్పాలి. రోజురోజుకీ పెరుగుతున్న ధరలు, ఉద్యోగ భద్రతపై అనుమానాలు నెలకొన్న తరుణంలో కేవలం భౌతిక రక్షణే కాకుండా ఆర్థికంగానూ వారికి భరోసా ఇవ్వాలి. అదే అక్కాచెల్లెళ్లకిచ్చే నిజమైన బహుమతి.



రాజమహేంద్రవరంలో రాఖీలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

కేవలం అక్కాచెల్లెళ్ల ఆరోగ్యానికే కాదు.. వారి భవిష్యత్తుకూ భరోసా కల్పించేలా బీమా పాలసీ కొనిపెట్టడం మంచి మార్గం. వారి కోసం టర్మ్ ఇన్సూరెన్స్‌తో పాటు ఆరోగ్య బీమా పాలసీ కూడా తీసుకోవాలి. ఎంత తక్కువ వయసులో తీసుకుంటే వారికి అంత ప్రయోజనం. దీనివల్ల భవిష్యత్తులో ఏమైనా అనారోగ్య సమస్యలు తలెత్తినా ఆర్థికంగా ఇబ్బందులు ఎదురుకాకుండా ఉంటుంది. మరోవైపు పెరుగుతున్న వైద్య ఖర్చుల నేపథ్యంలో వారికి మంచి బహుమతి ఇచ్చిన వారమవుతాం.

ఓ మంచి ప్రణాళికను సిద్ధం చేయండి..

అక్కాచెల్లెళ్లకు ఆర్థిక వ్యవహారాలపై పెద్దగా అవగాహన లేకపోతే వారికి ఓ నిర్దిష్టమైన ప్రణాళికను రూపొందించి ఇవ్వండి. ఆమె భవిష్యత్తు అవసరాలు, లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక ప్రణాళికను సిద్ధం చేయాలి. చదువు, ఉద్యోగం, మదుపు, పొదుపు, వివాహానంతర జీవితం... వీటన్నిటినీ పరిగణలోకి తీసుకుని వారికి ఆర్థిక భరోసానిచ్చే చక్కటి ప్రణాళికను వారి చేతిలో పెట్టాలి.



డిజిటల్ బంగారం బెటర్...

రాఖీ పండగ సందర్భంగా కొంతమంది తమ సోదరీమణులకు బంగారాన్ని బహుమతిగా ఇస్తుంటారు. అయితే భౌతిక బంగారం కంటే పసిడి బాండ్లను కొనివ్వడం మేలు. ఇప్పుడు అవి అందుబాటులో లేకపోయినా.. ఆ సొమ్మును పక్కకు తీసి ప్రభుత్వం వాటిని విక్రయించినప్పుడు కొని గిఫ్టుగా ఇవ్వండి. దీనివల్ల బంగారంతో పాటు ఏటా కొంత రాబడి కూడా అందించినవారవుతారు. భద్రత కరువైన ఈ తరుణంలో డిజిటల్ రూపంలో గోల్డ్ ఇవ్వడం మంచి ఆలోచన.

రక్షాబంధన్ వేడుకలకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ముస్తాబైంది. తమ ప్రియమైన సోదరులకు రాఖీలు కట్టేందుకు ఇంటి ఆడపడుచులు సిద్ధమవుతున్నారు. అన్నా చెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండుగకు ప్రతి ఇల్లు ముస్తాబైంది. తమ సోదరులు జీవితాంతం తమకు రక్షగా ఉండాలని ఇవాళ వారి చేతికి అక్కాచెల్లెళ్లు రాఖీ కడతారు. మార్కెట్లో రకరకాల రాఖీల కొనుగోళ్లల్లో అక్కలు, చెల్లెళ్లు బిజీబిజీగా ఉన్నారు.





పోటీల ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, యోగా ఈవెంట్ నిర్వహిస్తున్న చాగల్లు హైస్కూలు విద్యార్థినులు

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలి

- కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- చాగల్లు హైస్కూల్లో రాష్ట్ర స్థాయి టార్గెట్‌బాల్ చాంపియన్‌షిప్ ప్రారంభం

చాగల్లు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): క్రీడల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. తూర్పు గోదావరి జిల్లా చాగల్లు హైస్కూల్లో రాష్ట్రస్థాయి జూనియర్ బాల, బాలికల మిక్స్‌డ్ టార్గెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల కేంద్రాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కొవ్వూరులో నిర్మాణంలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. చదువుతో పాటు క్రీడలకు తగిన ప్రాధాన్యమివ్వాలన్నారు. శాప్ డైరెక్టర్ పి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలకు క్రీడా సామగ్రి కిట్లు అందజేయడానికి రూ.30వేలు చొప్పున కేటాయించామన్నారు. త్వరలోనే సామగ్రి కొనుగోలు చేసి పాఠశాలలకు ఇస్తామన్నారు. క్రీడల్లో రాణించే వారికి ప్రభుత్వం ఇచ్చే నగదు పారితోషికాన్ని పెంచినట్టు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో క్రీడల అభివృద్ధికి విప్లవాత్మకమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కడపలో స్పోర్ట్స్ స్కూలు అభివృద్ధికి రూ.40లక్షలు కేటాయించినట్టు చెప్పారు. రాష్ట్రంలో 110 క్రీడా మైదానాల అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా స్ఫూర్తి, టీమ్ స్పిరిట్ కలిగి ఉండాలన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి పదికి పైగా జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కరుటూరి సతీష్, ఎస్ఎంసీ చైర్మన్ కొఠారు గోపాలకృష్ణ, కూటమి నాయకులు తాళ్లూరి హరిశ్చంద్ర ప్రసాద్, ఈడుపుగంటి సుబ్బారావు, తాళ్లూరి వరప్రసాద్, మిరియాల సతీష్, వివిధ పాఠశాలల వ్యాయామోపాధ్యాయులు, సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

వారాహిదేవిగా వనదుర్గమ్మ

అన్నవరం దేవస్థానం ఉద్యోగుల సంఘం తరపున సారె సమర్పణ



వారాహిదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న వనదుర్గ

అన్నవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గమ్మ అమ్మవారి శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా నాల్గోరోజైన శుక్రవారం వారాహిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేషపూజలు, కుంకుమార్చనలు, అర్చకస్వాములు నిర్వహించారు. దేవస్థానం ఉద్యోగుల సంఘం తరపున అమ్మవారికి సారెను సమర్పించారు. ఈవో వీర్ల సుబ్బారావు, ఉద్యోగుల సంఘం నాయకులు గంటా విష్ణు, అనకాపల్లి ప్రసాద్, బాస్కర్, పోల్నాటి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం

వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తశతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



వనదుర్గకు దేవస్థానం ఉద్యోగుల సంఘం తరపున సారె తీసుకెళ్తున్న ఉద్యోగులు

ఆదివాసీల ఊపిరి ఆపేస్తారా?

- రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో ఆగని మరణాలు
- ప్రశ్నార్థకంగా గర్భిణుల ఆరోగ్యం
- అందుబాటులో ఉండని వైద్యులు
- చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు
- ఆదివాసీ మహిళ మరణం
- కేసు స్వీకరించిన జాతీయ కమిషన్లు

(రంపచోడవరం/ఆంధ్రజ్యోతి)

ఆదివాసీల ఆరోగ్యం కోసం కూటమి ప్రభుత్వం పడుతున్న తపనకు భిన్నంగా నడుస్తున్న రంపచోడవరం మన్యంలోని ప్రభుత్వ రంగ ఆసుపత్రులు ఆదివాసీల ఊపిరి తీస్తున్నాయి. రంపచోడవరంలోని ఏరియా ఆసుపత్రి అయితే మృత్యు కుహరంగా మారి ఇక్కడకు చేరడానికే ఆదివాసీ గర్భిణులు ఆందోళన చెందే దుస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వంలో అందిన సేవలకు భిన్నంగా అన్ని ఆసుపత్రుల్లోనూ మెరుగైన వైద్య సేవలను అందించాలని ప్రభుత్వం భావించి అనేక వసతులను కల్పించినా ఆదివాసీల ప్రాణాలకు ఆసుపత్రుల్లో రక్షణ లేకుండా పోతోంది. కేవలం 8 నెలల్లో ఒక్క రంపచోడవరం ఏజెన్సీ డివిజన్ పరిధిలోని 7 మండలాల్లోని ఆదివాసీలు చవిచూసిన ఆసుపత్రి మరణాలు వెలుగులోకి వచ్చినవి కొన్నే అయితే వెలుగు చూడనివి ఎన్నో ఉన్నాయి. మన్యంలో ఉన్న ఆదివాసీల స్థితి గతులను దృష్టిలో ఉంచుకుని కార్పొరేట్ స్థాయిలో అన్నిరకాల వైద్య సేవలకు అనుగుణంగా ఆసుపత్రులను తీర్చిదిద్దితే వైద్యులు విధులను విస్మరించి అవసరానికి అందుబాటులో లేకుండా పోవడంతో ప్రాణా పాయస్థితుల్లో మరణాలను నివారించగలిగే అవకాశాలను, మెరుగైన వైద్యం పొందే హక్కులను ఆదివాసీలు కోల్పోతున్నారు. ఒక్క రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొంది మరణించిన వారే ఈ సంవత్సరంలో పదివరకూ ఉంటాయని అనధికార అంచనా!



రంపచోడవరం ఏరియా ఆసుపత్రి

చేతులు దులిపేసుకుని...

పండా సింధూరం అనే ఆదివాసీ మహిళ తన నాల్గో కాన్పు కోసం రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో 20 రోజుల పాటు చికిత్స తీసుకున్న అనంతరం బుధవారం ప్రసవానికి తీసుకువెళ్లిన సందర్భంలో బిడ్డ చేతులు బయటకు వచ్చాక ప్రాణాపాయ స్థితికి చేరుకోవడంతో అప్పటికప్పుడు రాజమండ్రికి తరలించి ఇక్కడి ఆసుపత్రి వైద్యులు చేతులు దులిపేసుకున్నారు. అయితే రాజమండ్రిలో ఆమె ప్రాణాలు కోల్పోగా, ఆమె కడుపులో ఉన్న బిడ్డను సిజేరియన్ చేసి తీసేందుకు ప్రయత్నించినా బిడ్డ ప్రాణాలు కూడా దక్కలేదు. వాస్తవానికి రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో సిజేరియన్ చేసేందుకు అవసరమైన అన్ని వసతులూ, సౌకర్యాలూ ఉన్నా సమయానికి సిజేరియన్ చేయకపోవడమే ఆదివాసీ మహిళ మరణానికి కారణమైంది. అంతకు కొద్దిరోజుల ముందు మరో మహిళను కూడా ఇదే పరిస్థితుల్లో రాజమండ్రికి తరలిస్తుంటే మార్గమధ్యలో అంబులెన్సులోనే ప్రసవించింది. అంతకు ముందు వై.రామవరం మండలానికి చెందిన కాకూరి పార్వతి అనే మహిళ కూడా సహజ ప్రసవం సమయంలోనే మరణించింది. ఆమెకు కూడా సిజేరియన్ చేసే అవకాశం ఉన్నా కాపాడలేదు.

వైద్యుల్లో నిర్లక్ష్యం...

ప్రతి ఘటనపైనా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకే కాకుండా మన్యానికి పెద్ద దిక్కుగా ఉన్న రంపచోడవరం ఐటీడీఏ ఉన్నతాధికారికి తెలిసినా ఇటువంటి ఘటనలను పునరావృతం కాకుండా చూడలేకపోతున్నారు. ఇక్కడి పరిస్థితిని లోతుగా చూస్తే అన్ని హంగులతో ప్రభుత్వం చర్యలు చేపట్టినా ఆసుపత్రిలో వైద్యులకు చిత్తశుద్ధి కొరవడి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎందరో ఆదివాసీలు ఆర్థిక పరిస్థితులు బాగోలేక ప్రభుత్వం ఆదుకుంటుందని రంపచోడవరం ఏరియా ఆసుపత్రిని ఆశ్రయిస్తున్నారు. కానీ ఇక్కడ వైద్యం సులభంగా అందించడం లేదు.

బాధితుల ఫిర్యాదులు

ప్రసవం కల్పించి, తల్లీబిడ్డలను సురక్షితంగా పంపించే సౌకర్యాలు ఉన్నా ఆ దిశగా పని చేయడంలో రంపచోడవరం ఆసుపత్రి విఫలమైంది. ఆదివాసీల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో సీరియస్‌గా వ్యవహరిస్తున్నప్పటికీ ఇద్దరు ఐఏఎస్ అధికారులు, కీలక ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలో రంపచోడవరం కేంద్రంలో నడుస్తున్న నిర్లక్ష్య మరణాలు ఆగడం లేదు. ఆయా ఘటనలు జరిగినపుడు మొక్కుబడిగా వ్యవహరిస్తూ ఆయా వైద్యులను కాపాడే దిశగానే ఉన్నతాధికారుల చర్యలు ఉండటంతో బాధితులు నేరుగా జాతీయ హక్కుల, జాతీయ గిరిజన కమిషన్లను ఆశ్రయించి ఫిర్యాదులు చేస్తున్నారు. వై.రామవరం ఆదివాసీ మహిళ మరణంపై ఇప్పటికే జాతీయ హక్కుల కమిషన్, గిరిజన కమిషన్లు కేసు నమోదు చేసుకున్నాయి. ఆదివాసీ దినోత్సవ నేపథ్యంలోనైనా ముఖ్యమంత్రి మన్యం పర్యటనలో ఆదివాసీల ఆరోగ్యంపై సీరియస్‌గా స్పందించి ఆరోగ్య సేవలు అందేలా కృషి చేస్తారని ఆదివాసీ సమాజం ఎదురుచూస్తోంది.

గర్భిణి మృతిపై విచారణ



సింధూరం (ఫైల్)

రంపచోడవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిండు గర్భిణి పండా సింధూరం, గర్భంలో ఉన్న బిడ్డ మృతిపై రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో పాడేరు డీసీహెచ్ వీరవేణి శుక్రవారం విచారణ ప్రారంభించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ శేషారెడ్డి, డాక్టర్లు, సిబ్బందిని విచారించారు. ఈ విచారణ నివేదికను సెకండరీ హెల్త్ డైరక్టర్‌కు అందించనున్నట్టు ఆమె తెలిపారు.

సరుకు దొరికింది... సంగతి తేలాలి!

- పిఠాపురంలో చోరీ అయిన సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ల స్టాకు స్వాధీనం
- సరుకు తరలించిన వాహనాల సీజ్
- ఐదుగురి పాత్ర ఉన్నట్టు గుర్తింపు
- వారి గత చరిత్రపై విచారణ



స్వాధీనం చేసుకున్న ప్యాకెట్లను వాహనాల్లోకి ఎక్కిస్తున్న దృశ్యం

పిఠాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ ప్యాకెట్ల లోడు లారీ చోరీ కేసులో ఐదుగురు వ్యక్తుల పాత్ర ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఇప్పటికే లారీ దొరకగా, వివిధ ప్రాంతాలకు తరలించిన సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ల స్టాకుతో పాటు, అందుకు వినియోగించిన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్న పోలీసులు వారి గత చరిత్రపై దృష్టి పెట్టారు. వారికి గల రాజకీయ సంబంధాలపై ఆరా తీస్తున్నారు.

అసలేం జరిగిందంటే...

కాకినాడ జిల్లా పిఠాపురంలో ఆయిల్‌ప్యాకెట్లు లోడుతో ఉన్న లారీ 2 రోజుల క్రితం చోరీ కావడం సంచలనం కలిగించింది. కాకినాడలోని జెమిని ఆయిల్ ఫ్యాక్టరీ నుంచి రూ.28లక్షలు విలువైన సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లు లోడుతో ఉన్న లారీని పిఠాపురం తీసుకువచ్చి ఈనెల 5న రాత్రి పార్కు చేయగా దానిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. సరుకుతో సహా లారీ మాయమైన విషయాన్ని బుధవారం ఉదయం గుర్తించిన లారీ ఓనర్ కమ్ డ్రైవర్ దగ్గు అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. 6న ఉదయం 11గంటల సమయంలో ఖాళీ లారీని తుని సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద గుర్తించారు. అందులో సరుకు లేకపోవడంతో సరుకు ఎక్కడ డంప్ చేశారనే విషయంలో పోలీసులు విచారణ చేపట్టారు. గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలు, అక్కడ ఒక వ్యక్తి మోటార్‌సైకిల్‌పై వచ్చి టోల్‌ఫీ చెల్లించడం తదితర విషయాలను గుర్తించి విచారణ సాగించగా సరుకు ఎక్కడెక్కడ దింపారో వెల్లడైంది. కత్తిపూడి శివారు, మండపం సమీపంలో మామిడితోటల్లో బొలెరో, టాటా మేజిక్ వాహనాలు, ట్రాక్టర్ల ద్వారా సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లను తరలించి నిల్వ చేసినట్టు గుర్తించారు. వీటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇంకా మరికొంత సరుకు దొరకాల్సి ఉంది. ఈ సంఘటనలో పిఠాపురం పట్టణానికి చెందిన ఇద్దరు, పండూరుకు చెందిన ఒకరు, మండపం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల పాత్ర ఉన్నట్టు ఇప్పటి వరకూ గుర్తించారు. వారిలో కొందరు ఒక రాజకీయ పార్టీ కోసం పనిచేయడమే లారీ యూనియన్ పదవుల కోసం ప్రయత్నించినట్టు చెబుతున్నారు. వీరు ఈ ఒక్క లారీ చోరీకే పాల్పడ్డారా, 3 రోజుల క్రితం జరిగిన నూకల లోడు లారీ చోరీ సంఘటన, అంతకు ముందు జరిగిన గుట్కా ప్యాకెట్లు వాహనం చోరీ తదితర సంఘటనలతో సంబంధం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు. వారి గత చరిత్రపై ఆరా తీస్తున్నారు. లారీని చోరీ చేసిన తర్వాత కొందరు వ్యక్తులు కారులో అనుసరించినట్టు సమాచారం. ఈ వాహనం ఎవరిది, కారులో ఎవరెవరు ఉన్నారు తదితర అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి కథనంతో...

సన్‌ఫ్లవర్ ఆయిల్ లోడు లారీయే గాక గత ఆదివారం రాత్రి నూకలలోడు లారీ చోరీకి గురైందని, జీపీఎస్ ఉండడంతో రౌతులపూడి మండలం గిడజాం వద్ద దానిని గుర్తించారని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై పోలీసులు ఇప్పుడు దృష్టిసారించారు. ఈ విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకోవడంతో సదరు లారీ యజమాని వద్ద ఫిర్యాదు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. లారీ ఎలా చోరీకి గురైందో ఆరా తీస్తున్నారు.

నాలుగు దర్యాప్తు బృందాల ఏర్పాటు

లారీ చోరీ సంఘటనపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు 4 దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేసినట్టు పిఠాపురం సీఐ శ్రీనివాస్ తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి దర్యాప్తు చేస్తున్నామన్నారు. లారీతో పాటు మాయమైన సరుకును గుర్తించామని తెలిపారు. కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్టు ఆయన చెప్పారు.

యానాంలో యువకుడి అనుమానాస్పద మృతి



మరణించిన గురుమూర్తి

యానాం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): యానాంలోని ఓ లాడ్జిలో గురువారం అర్ధరాత్రి యువకుడు అనుమనాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం కేశనకుర్రుకు చెందిన చింతా గురుమూర్తి(21) ముగ్గురు స్నేహితులతో యానాం రాజీవ్‌బీచ్‌లోని సూర్యలాడ్జిలో దిగారు. వారు సాయంత్రం నుంచి మద్యం తాగుతున్నారు. మొదటి అంతస్తులోని గదిలో సహచార మిత్రులు పడుకోగా ఫోన్ మాట్లాడడానికి వచ్చిన గురుమూర్తి అనుమనాస్పదస్థితిలో కిటీకి పక్కనే ఉన్న కరెంటు తీగలపై పడిపోయి మృతిచెందాడు. అటుగా వెళ్తున్న కొందరు చూసి లాడ్జి ప్రతినిధుకు చెప్పడంతో వారు పోలీసులుకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, అగ్నిమాపశాఖ ఉద్యోగులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. గురుమూర్తి ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. తండ్రి త్రిమూర్తులు కూలీ పనిచేస్తుండగా, చెల్లి దివ్యాంగురాలు.

మెట్ల పై నుంచి జారిపడి వ్యక్తి మృతి

అల్లవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బెండమూరిలంక గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ ముత్యాల వీరన్నబాబు(47) బిల్డింగ్ మెట్ల పై నుంచి జారి పడి మృతి చెందాడు. శుక్రవారం బెండమూరిలంకలో యాళ్ల వెంకటరామోహనరావు బిల్డింగ్ పనులకు వచ్చిన వీరన్నబాబు మెట్ల పై నుంచి జారి పడి తీవ్ర గాయాలతో అపాస్మకర స్థితికి చేరుకున్నాడు. అమలాపురం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. అతడి కుమారుడు సాయిపవన్‌కుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్ఐ బి.సంపత్‌కుమార్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కె.గంగవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలంలో భట్లపాలిక శివారు చర్లంపూడికి చెందిన మేడిశెట్టి దుర్గారావు(40) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు పామర్రు ఇన్‌చార్జి ఎస్ఐ భుజంగరావు తెలిపారు. దుర్గారావు గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దుర్గారావు సోదరుడు మేడిశెట్టి వాడపల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

వ్యక్తిని గాయపర్చిన ముగ్గురిపై కేసు

కొవ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం బంగారంపేటకు చెందిన కర్రి నవీన్‌కుమార్, అతడి పిన్ని సువర్ణరత్నం ఇంటిముందు వేసిన కంకర విషయంలో ఘర్షణపడ్డారు. దీంతో సువర్ణరత్నం బంధువులు శేఖర్, సురేష్, కిరణ్ నవీన్ ఇంట్లోకి వచ్చి తలపై కొట్టి గాయపర్చారు. చంపుతామని బెదిరించడంతో కొవ్వూరు పోలీసులకు నవీన్ ఫిర్యాదు చేశాడు. దీంతో వారిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి పేర్కొన్నారు.

గంజాయితో నలుగురి అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

మండపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని మారేడుబాక పంచాయతీ పరిధిలోగల సాయినగర్‌లో గంజాయితో నలుగురిని పట్టుకున్నామని పట్టణ ఎస్ఐ రాము తెలిపారు. గురువారం రాత్రి సాయినగర్‌లో యవత గంజాయి సేవిస్తున్నారని సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. మారేడుబాకకు చెందిన ఇద్దరు యువకులు, అనపర్తికి చెందిన యువకుడు, మండపేట పట్టణానికి చెందిన 17 ఏళ్ల బాలికను ఆదుపులోకి తీసుకుని వారి నుంచి 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి ఆలమూరు కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌విధించారని ఎస్ఐ తెలిపారు.

గోదావరిలో దూకి వృద్ధుడి మృతి



మృతిచెందిన విశ్వేశ్వరరావు

కొవ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గోదావరిలో దూకి వృద్ధుడు మృతిచెందాడు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం మద్దూరులంక గ్రామానికి చెందిన తాటి విశ్వేశ్వరరావు (65) పెళ్లి సంబంధాలు కుదుర్చుతుంటాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. శుక్రవారం మధ్యాహ్నం మద్దూరులంక- బొబ్బర్లంక మధ్య బ్యారేజ్ వంతెన పై నుంచి గోదావరిలో దూకేశాడు. అక్కడ ఉన్న జాలర్లు పడవల సాయంతో విశ్వేశ్వరరావును గుర్తించి బయటకు తీసుకువచ్చారు. అప్పటికే విశ్వేశ్వరరావు మృతిచెందాడు.

మహిళ గల్లంతు..

రోడ్డు కం రైలు బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకిన మహిళ గల్లంతైంది. కొవ్వూరు పట్టణ పోలీసులు, స్థానికులు అందించిన వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి సుమారు 30 వయస్సు కలిగిన మహిళ ఆటోలో కొవ్వూరు బయలుదేరింది. బ్రిడ్జిపై 151వ స్తంభం వద్ద ఆటో ఆపమని ఒక్కసారిగా వంతెనపై నుంచి గోదావరిలో దూకేసింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు బోటులో నదిలో గాలింపు చేపట్టారు. ఆచూకీ తెలియరాలేదు. దీనిపై కేసు నమోదు కావలిసి ఉంది.

గోదావరిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం



కొవ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని కొవ్వూరు పట్టణ పోలీసులు గుర్తించారు. వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు గోష్పాద క్షేత్రంలోని ఏపీ టూరిజం బోటు పాయింటు వద్ద 35 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉండే వ్యక్తి మృతదేహం కనిపిండంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానిక జాలర్ల సహాయంతో నది నుంచి బయటకు తీయించారు. మృతదేహం డీకంపోజ్ కావడంతో గుర్తుపట్టడానికి వీలులేకుండా తయారై మృతుడికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసినవారు కొవ్వూరు పట్టణ పోలీస్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. వీఆర్వో విప్పర్తి మంగాయమ్మ అందించిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ జి.శ్రీనివాస్ తెలిపారు.

ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రధాన అర్చకుడు ఫణికుమార్ శివైక్యం



కళ్లేపల్లి ఫణికుమార్ (ఫైల్)

ద్రాక్షారామ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ద్రాక్షారామ భీమేశ్వరాలయ అనువంశిక అర్చకుడు, ప్రధాన అర్చకుడు కళ్లేపల్లి ఫణికుమార్ (83) శుక్రవారం శివైక్యం చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఫణికుమార్ సుదీర్ఘకాలం భీమేశ్వరాలయ అర్చకుడిగా సేవలందించారు. ఏపీ అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా ఫణికుమార్ అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఆయన మృతికి సంతాపంగా భీమేశ్వరాలయాన్ని శుక్రవారం మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు మూసివేశారు. ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవానీ, ఆలయ అర్చక, వేదపండిత బృందం, ఆలయ సిబ్బంది, రామచంద్రపురం డివిజన్ ఆలయాల సిబ్బంది, ఏపీ పురోహిత బ్రహ్మణ సమాఖ్య బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి గణేష్‌శర్మ తదితరులు సంతాపం తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని ఇద్దరికి గాయాలు



గాయపడినవారిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

కొవ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. కొవ్వూరు పట్టణానికి చెందిన కల్లూరి పైడిరాజు, బడే సత్యవతి బైక్‌పై దేవరపల్లి నుంచి కొవ్వూరు బయలుదేరారు. కాపవరం పై ఓవర్ సర్వీస్ రోడ్ మధ్యలో డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో బైక్ పై నుంచి ఇద్దరు కింద పడిపోయారు. తల, చేతులు,కాళ్లకు గాయలయ్యాయి. 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ముమ్మిడివరంలో అగ్నిప్రమాదం

రూ.3 లక్షల ఆస్తినష్టం



ప్రమాదంలో కాలి బూడిదైన సర్టిఫికెట్లు





ముమ్మిడివరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ చింతలమెరకలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఒక డాబా దగ్ధమై రూ. 3 లక్షల ఆస్తినష్టం సంభవించింది. శుక్రవారం తెల్లవారుజామున మట్టపర్తి ప్రసాద్ (చిన్నబాల)కు చెందిన ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీక్ అవ్వడంతో మంటలు వ్యాపించి అగ్ని ప్రమాదం జరిగింది. బంగారపు ఆభరణాలు విలువైన దస్తావేజులు, పిల్లల స్కూల్ సర్టిఫికెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. ముమ్మిడివరం అగ్ని మాపక ఇన్‌చార్జి అధికారి ఎం.బాలరాం ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు.

రైలు పట్టాల పక్కన గుర్తు తెలియని మృతదేహం



మాధవపురం రైల్వేగేటు సమీపంలో ఉన్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న తుని రైల్వే పోలీసులు

పిఠాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని మాధవపురం రైల్వే గేటు సమీపంలో రైలు పట్టాలు పక్కన ఉన్న మృతదేహాన్ని తుని రైల్వే పోలీసులు గుర్తించారు. విశాఖపట్టణం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న రైలు నుంచి జారిపడి 40-50 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్టు భావిస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలియరాలేదని తెలిపారు. ఎరుపు రంగు నెక్ టీషర్టు, కాకి నిక్కరు మృతదేహంపై ఉన్నాయని చెప్పారు. మృతదేహం కొంతభాగం ఎముకల గూడుగా ఉందని, దీనితో సంఘటన పది రోజుల క్రితం జరిగినట్టు భావిస్తున్నామని తెలిపారు. మృతదేహాన్ని తుని ఏరియా ప్రభుత్వాసుపత్రి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ప్రభుత్వ రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు.

మేఘం మురిసెను..



కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై అందంగా కనిపించింది. ఈ దృశ్యం చూపరులను కట్టిపడేసింది.

- ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి)

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

ప్రైవేట్ బస్సుల తనిఖీలు

ముమ్మిడివరం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి టోల్‌ప్లాజా వద్ద పలు ప్రైవేట్ బస్సులను రవాణాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రవాణాశాఖ జిల్లా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు అధ్వర్యంలో ప్రైవేటు బస్సుల రికార్డులను పరిశీలించారు. రికార్డులు సక్రమంగా లేని అయిదు బస్సులపై కేసులు నమోదు చేసి అపరాధ రుసుముగా రూ.9500 వసూలు చేసినట్టు రవాణాశాఖ అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో రవాణాశాఖ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, జ్యోతి సురేష్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేట్ బస్సును తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

కృష్ణాష్టమి వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

అమలాపురం రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్టు ఇస్కాన్ అవుట్ పోస్టు ఇన్‌ఛార్జి శివానంద ఇమాయిదాసు తెలిపారు. అమలాపురం రూరల్ మండలం జనుపల్లిలో ఇస్కాన్ ఆధ్వర్యంలో నూతనంగా భక్తుల సహకారంతో శ్రీమదన్‌గోపాల్ కుటీరం నిర్మిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా తొలుత నిర్మించిన శ్రీనితాయి గౌరంగ సంకీర్తన భవనాన్ని 10న ప్రారంభిస్తామన్నారు. ఆ రోజు ఉదయం గడియార స్తంభం సెంటర్ నుంచి నగర సంకీర్తనతో భక్తులు జనుపల్లి చేరుకుంటారని ఆయన తెలిపారు. భవన ప్రారంభోత్సవం అనంతరం సత్యగోపీనాథ్‌దాసు ఆధ్యాత్మిక ప్రవచనాలుంటాయన్నారు. ఈ నెల 16న శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఉదయం ఉట్టి ఉత్సవం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్యామ్‌సత్యధర్మదాస్, సద్భుజ్ ప్రభుదాస్, వరదా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



వాసవీమాత ఆలయం వద్ద బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శివానంద నిమాయిదాసు

అంబరాన్నంటిన..

వేపచెట్టు అమ్మవారి సంబరం

అమలాపురం టౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని కల్వకొలను వీధి కనకదుర్గమ్మ వేపచెట్టుకు శతాబ్దాల చరిత్ర ఉంది. ఈ ఉత్సవాలను తరతరాలుగా నిర్వహిస్తున్నారు. ఆడపడుచుల సంబరంగా జరిగే ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు పోటెత్తుతారు. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఎక్కడెక్కడో ఉన్న ఆడపడుచులు పుట్టింటికి చేరి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. మేళతాళాలు, గరగ నృత్యాలు, మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పుల మధ్య వీటిని నిర్వహించారు. ఈ ఏడాది నూతనంగా గద్దె నిర్మించి అక్కడే అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కావిడి, మొక్కుబడులతో మహిళలు శిరసున గండదీపాలతో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి మహానివేదన అనంతరం గండదీపాలు అమ్మవారికి సమర్పించారు.



వేపచెట్టు కనకదుర్గ ఆలయం వద్ద భక్తుల సంబరాలు

జనసైనికుడికి ఎమ్మెల్యే గిడ్డి పరామర్శ

అంబాజీపేట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కాలుకి శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న జన సైనికుడు నూకపెయ్యి సూర్యచంద్రరావును మొసలపల్లిలో శుక్రవారం పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరామర్శించారు. గతంలో ప్రమాదానికి గురైన సూర్యచంద్రరావు ఏడుసార్లు కుడికాలుకు శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆయన్ను ఇరుసుమండ సొసైటీలో త్రిసభ్య కమిటీ సభ్యుడిగా నియమించేందుకు ప్రతిపాదనలు పంపించారు. ఆయన వెంట ఇరిగేషన్ శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, మండల శాఖ అధ్యక్షుడు దొమ్మేటి సాయికృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ కొర్లపాటి వెంకటేశ్వరరావు, మైపాల తాతాజీ, అరిగెల సూరిబాబు, కొప్పినీడి ఈశ్వరరావు, రవణం విజయ్ తదితరులు పాల్గొన్నారు.



జన సైనికుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

ప్రజా శ్రేయస్సు కోసమే తొలి అడుగు

యానాం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజా శేయస్సు కోసమే తొలిఅడుగు వేశామని వ్యాపారవేత్త తోటరాజు అన్నారు. యానాం ఫెర్రీ రోడ్డులోని గాజుల గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా తన స్వగృహం నుంచి సమావేశం ప్రాంగణం వద్దకు అభిమానులతో కలిసి ర్యాలీగా వచ్చారు. యానాంలో ఈ రోజు నుంచి ప్రజా జీవితంలోకి అడుగు పెట్టినట్టు తెలిపారు. యానాంలో పలు మార్పులను తీసుకువస్తానని అన్నారు. ఏమి చేస్తామో, ఏమి చేయాలనుకుంటున్నామో చెప్పాలే తప్ప ఇతరులను విమర్శించడం సరి కాదని ఆయన అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తోటరాజు

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు నిషేధం

అమలాపురం టౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు, 120మైక్రాన్ల కన్నా తక్కువ మందం గల పాలిథిన్ కవర్లను పూర్తిగా నిషేధించినట్టు అమలాపురం మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తెలిపారు. ఈ నెల 11 నుంచి వీటిని ఎవరైనా వినియోగిస్తే భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. వీటిని విక్రయించే షాపు యజమానులు, వినియోగించే దుకాణదారులతో సమావేశం నిర్వహించి హెచ్చరించామన్నారు. ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లకు బదులుగా గుడ్డ, నార, పేపరు సంచులు, బయో డిగ్రేడబుల్ వస్తువులను వినియోగించాలన్నారు. ప్రస్తుతం వీటిని మార్కెట్‌లోకి తీసుకొచ్చామన్నారు. అమలాపురం పట్టణాన్ని నూరు శాతం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఆయన కోరారు.



కరెన్సీ నోట్ల అలంకరణలో మావుళ్ళమ్మ

కరెన్సీ నోట్ల అలంకరణలో మావుళ్లమ్మ అమ్మవారు

కాట్రేనికోన, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మావుళ్లమ్మ అమ్మవారిని శుక్రవారం లక్ష రూపాయల కరెన్సీ నోట్లతో అలంకరించారు. భక్తులకు ధనలక్ష్మీ అమ్మవారిగా మావుళ్ళమ్మ దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆకివిళ్ళ పణికాంత్‌శాస్త్రి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. కార్యక్రమంలో అధ్యక్షుడు ఆకివిళ్ళ సాయిబాబా, రామకృష్ణ పరమహంస, శ్రీకాంత్, పవన్ తదితరులతో పాటు సుంకర పవిత్ర పాల్గొన్నారు.



వరలక్ష్మీదేవిగా దర్శనం

అమలాపురం టౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీదేవి మార్కెట్ సెంటర్‌లో ఉన్న శ్రీదేవి అమ్మవారు భక్తులకు వరలక్ష్మీదేవిగా శుక్రవారం దర్శనం ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

డిప్యూటీ సీఎం పవన్‌ను విమర్శించేస్థాయి ఇజ్రాయేల్‌కు లేదు

ఐ.పోలవరం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి ఎంతో శ్రమిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను విమర్శించేస్థాయి, నైతిక హక్కు వైసీపీ ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయేల్‌కు లేదని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు(బాలు) వ్యాఖ్యానించారు. శుక్రవారం మురమళ్ళలో ఎస్సీ సెల్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్ భిక్షతో ఎమ్మెల్సీగా ఉన్న ఇజ్రాయేలు అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న ప్రజా నాయకులను విమర్శించడటం విడ్డూరంగా ఉందన్నారు. నిజాయితీకి మారు పేరైన డిప్యూటీ సీఎం పవన్‌పై విమర్శలు చేస్తే మూల్యం చెల్లించుకోక తప్పదని వక్తలు హెచ్చరించారు. కార్యక్రమంలో పండు రాంజీ, బొంతు శ్రీరాములు, సాకా సీతాదేవి, బీర సత్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు జి.అగ్రహారంలో ఉచిత వైద్య శిబిరం

అంబాజీపేట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు మహేష్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని గంగలకుర్రు అగ్రహారం హైస్కూల్ ఎదురుగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆయన అభిమానులు తెలిపారు. సహస్ర బ్లడ్ క్యాంపు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, ఆర్థో వైద్యులు చొల్లంగి అనిల్‌కుమార్, వైద్యులు టి.గోపికృష్ణ వైద్య శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహేష్ ఫ్యాన్స్ కోరారు.

నిత్యాన్న దానానికి విరాళం

మామిడికుదురు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బాలబాలాజీ దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్న దాన పథకానికి మండపేటకు చెందిన కొప్పాక సత్యనారాయణ, కుటుంబ సభ్యులు రూ.10 వేలు విరాళం ఇచ్చారు. ఆలయ అర్చకులు వారికి ఆశీర్వచనం అందజేసి స్వామి వారి చిత్రపటంతో పాటు ప్రసాదాలు అందజేశారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి పూజలు



అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారంలో శాకంబరిదేవి అలంకరణలో కనకదుర్గమ్మ

అంబాజీపేట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా మండలంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. వరలక్ష్మి వ్రతం సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు జరిపారు. వేకువజామునే ఆయా ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

శాకంబరి అలంకరణలో: మండలంలోని గంగలకుర్రు అగ్రహారంలోనున్న కనకదుర్గమ్మను వివిధ రకాల కూరగాయలతో శాకంబరి దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులు సమకూర్చిన వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. మండలంలోని అమ్మవారి ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాలు కళకళలాడాయి. లంకల గన్నవరం గ్రామదేవత శ్రీమహలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఉదయం విశేష పూజల అనంతరం అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. పి.గన్నవరం శివారు తాటికాయవారిపాలెం, పి.గన్నవరం గ్రామాల్లోని కనకదుర్గ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముంగండ, నరేంద్రపురం, ఊడిమూడి, గంటి పెదపూడి, మానేపల్లి, కుందాలపల్లి, బెల్లంపూడి తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల వద్ద మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలోని ఆయా దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించిన మహిళలు అమ్మవారి ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. బెండమూర్లంక, అల్లవరం, పి.రావులపాలెం గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో భక్తులు పూజలు జరిపారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాలు

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మి వ్రతాలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, సామూహిక వరలక్ష్మి వ్రతాలు జరిపారు.



ముమ్మిడివరంలో వరలక్ష్మి పూజలు

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలోని ఆయా ఆలయాల్లో భక్తులతో రద్దీ నెలకొంది. మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని గ్రామ దేవతల ఆలయాలు కిటకిటలాడాయి.



లంకల గన్నవరంలో ప్రత్యేక అలంకరణలో శ్రీమహాలక్ష్మి అమ్మవారు

యానాంలో కిటకిటలాడిన ఆలయాలు

యానాం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ఆయా ఆలయాలు కిటకిటలాడాయి. స్థానిక పిల్లరాయ ఆలయంతోపాటు పడవలరేవు వీధిలోని శ్రీలలితాదేవి, శివాలయ ప్రాంగణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి, స్థానిక గోపాల్‌నగర్‌లోని శారదాదేవి ఆలయాలు కిటకిటలాడాయి. యానాం శివారు దరియాలతిప్ప-గిరియాంపేట రోడ్డులోని పాలకనకదుర్గ అమ్మవారి ఆలయంలో పలు పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రాయప్రోలు కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు చేశారు. శ్రావణమాస విశిష్టతలను అర్చకులు కామేశ్వరశర్మ భక్తులకు తెలిపారు.

రూ.23 లక్షలతో అలంకరణ: యానాం ఆత్రేయ గోదావరి చెంతన ఉన్న వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ధనలక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. శ్రావణమాసం సందర్భంగా ప్రతి ఏడాది అమ్మవారిని ధనలక్ష్మీ దేవిగా అలంకరించి పూజలు నిర్వహిస్తారు. శుక్రవారం వంకాయల కుటుంబ సభ్యులు, యానాం ఆర్యవైశ్య సంఘం సభ్యులు రూ.23 లక్షలతో అమ్మవారిని ధనలక్ష్మీదేవిగా అలంకరించారు. యానాం పరిసర ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీసాయి లలిత భక్త మండలి భక్త బృందంచే లలిత, విష్ణు సహస్ర నామాలతో అమ్మవారిని పూజించారు.



ప్రత్యేక అలంకరణలో పాలకనకదుర్గ అమ్మవారు



రఘురామయ్యను సన్మానిస్తున్న జిల్లా కార్యవర్గ సభ్యులు

బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

మామిడికుదురు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘానికి నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా నైనాల రఘురామయ్య, ప్రధాన కార్యదర్శిగా గెద్దాడ నాగేశ్వరావు, ఆర్థిక కార్యదర్శిగా జగతాడి రామకృష్ణ సోమరాజు, ఉపాధ్యక్షులుగా కాట్రాడి వెర్రియ్య, బాలం రామకృష్ణ, గుత్తుల శ్రీనివాస్, ఇంకా సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కా వీర వెంకటేశ్వరావు వ్యహరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కె.వెంకటనరసింహరాజు, సహాయ కార్యదర్శి కడలి వెంకటేశ్వర్లు, రాయుడు నాగేశ్వరరావు, పాల సోమేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

రాజవరంలో పోలీసుల తనిఖీలు

ఆత్రేయపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రాజవరంలో శుక్రవారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఆధ్వర్యంలో రూరల్ సీఐ విద్యాసాగర్ 25 మంది పోలీసులతో విస్తృత తనిఖీలు చేపట్టారు. రికార్డులు లేని 20 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఓ మహిళ ఇంటి వద్ద 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 20 లీటర్ల సారా, డ్రమ్‌లను స్వాధీనం చేసుకుని ఆమెను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐలు ఎస్.రాము, సురేంద్ర, నరేంద్రలతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్వేది ఆలయంలో ప్రత్యేక పూజలు

అంతర్వేది, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోనున్న అమ్మవారి సన్నిధిలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మి కుంకుమ పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి జరిగిన అమ్మవారి కుంకుమపూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ అధికారులు ఉచితంగా పూజా సామగ్రి అందించారు. అర్చక స్వాములు అమ్మవారికి నిర్వహించిన కుంకుమ పూజలు, వ్రత కల్పనలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకున్న అనంతరం స్వామివారి అన్న ప్రసాదంలో పాల్గొన్నారు.



వరలక్ష్మివ్రతం నిర్వహిస్తున్న అర్చకులు

వాడపల్లి వెంకన్న ఆలయంలో అష్టోత్తర పూజలు



ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,19,143 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అలాగే వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి మండపేట మండలం వెలగతోడుకు చెందిన వడవర్తి మంగాబేబీసరోజ, యశ్వంత్‌కిరణ్‌కుమార్ రూ.1.16 లక్షలు విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం అందజేశారు.

రాఖీ పౌర్ణమికి ఏర్పాట్లు..

శ్రావణ శనివారం శ్రవణ నక్షత్రం, రాఖీ పౌర్ణమి సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి భక్తుల తాకిడి అధికంగా ఉండొచ్చన్న అంచనాలతో ఏర్పాట్లు చేపడుతున్నారు. ప్రత్యేక షామియానాలు, రోడ్లపై టెంట్లు, లైన్ల పెండాల, మెడికల్ క్యాంపులు ఏర్పాటు, తాగునీరు సౌకర్యం, ప్రదక్షిణలు నిర్వహించే మాడవీధుల్లో ఫ్యాన్లు, లైన్ల వద్ద కూలర్లు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పార్కింగ్ వద్ద టాయిలెట్ల ఏర్పాట్లు తదితర సౌకర్యాలపై వివిధ శాఖల అధికారులతో డిప్యూటీ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షించారు. గోదావరిలో వరద నీరు ఉండడంతో పుష్కరఘాట్‌లోకి భక్తులు దిగి స్నానాలు ఆచరించకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి నదీలోకి వెళ్లకుండా గేట్లు ఏర్పాటు చేశారు. మరో ఘాట్‌లో భక్తులు స్నానం ఆచరించేందుకు జల్లు స్నానం ఏర్పాట్లను నిర్వహించారు. బందోబస్తు పెంపుదల చేస్తున్నట్టు డిప్యూటీ కమిషనరు వివరించారు. భక్తుల రద్దీకి తగినట్టు ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు.



దాతకు స్వామివారి చిత్రపటం అందజేత

ఎక్కడి చెత్త అక్కడే..

• గ్రామాల్లో కానరాని స్వచ్ఛ భారత్ • వినియోగంలోకి రాని సంపద కేంద్రాలు

రోడ్లపైనే చెత్తను డంపింగ్ చేస్తున్న ప్రజలు • పట్టించుకోని యంత్రాంగం



కె.పెదపూడి ప్రధాన రహదారిలో దర్శనమిస్తున్న చెత్తకుప్పలు(ఫైల్)

అంబాజీపేట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర..స్వర్ణాంధ్ర కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దీనికి నిదర్శనమే గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయని వారంటున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించిన చెత్త సంపద కేంద్రాలు పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావడంతో ప్రజలు రోడ్లపైనే చెత్త పడేస్తున్నారు. దీంతో ప్రధాన రహదారులు, కూడళ్లలో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. దీనికితోడు క్షేత్రస్థాయిలో సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించకపోవడంతో పాటు అధికారుల పర్యవేక్షణ లేక ఆయా ప్రాంతాల్లో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయని స్థానికులంటున్నారు. గ్రామ శివారుల్లో చూస్తే వ్యర్థాలు, ప్లాస్టిక్ వస్తువులు కుప్పలుగా పడి ఉంటున్నాయి. అంబాజీపేట మండలం కె.పెదపూడి ప్రధాన రహదారి మీదుగా రాకపోకలు సాగించాలంటే భయపడాల్సిన పరిస్థితున్నాయి. వాటిని శుభ్రం చేయడంలో అధికారులు, పారిశుధ్య సిబ్బంది ఉదాసీనత చూపుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఆయా గ్రామాల్లో తడిపొడి చెత్తను సేకరించేందుకు అందించిన డస్ట్‌బిన్లు ఇళ్లలో కనిపించడం లేదు. పారిశుధ్య కార్మికులు చెత్తను మాత్రమే సేకరించి వాటిని డంపింగ్ కేంద్రాలకు తరలిస్తున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఆయా ప్రధాన రహదారిలో రోజురోజుకు చెత్త పేరుకుపోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాటి నుంచి వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాచవరం- కె.పెదపూడి వంతెన, పేర్రాయిపాలెం వంతెన, ముక్కామల హైస్కూల్‌కు, మాచవరం వెళ్లే ప్రాంతాల్లో చెత్తకుప్పలు తిష్టవేశాయి. ఆయా ప్రాంతాల్లో వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రామాలయం పునర్నిర్మాణానికి భూమిపూజ


వెదురుపాకలో భూమిపూజ చేస్తున్న దృశ్యం

రాయవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక రెడ్ల వీధిలో రామాలయం పునర్నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. గ్రామానికి చెందిన చిన్నం వీరవెంకట సత్యనారాయణరెడ్డి, విజయలక్ష్మి దంపతులు పీఠంపై కూర్చుని తెల్లవారు జామున ఉత్తరాషాఢ నక్షత్ర, మిథున లగ్నంలో కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామానికి చెందిన ఇటికిరాల సుబ్రహ్మణ్యశర్మ, అంగర జనార్దన్ అర్చకత్వంలో సత్యనారాయణరెడ్డి దంపతులు పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో రెడ్ల రామాలయ పునర్నిర్మాణ కమిటీ గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు సచివాలయ భవనాలు ప్రారంభం


ఇప్పనపాడులో నిర్మించిన నూతన భవనం

మండపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పనపాడులో నూతనంగా నిర్మించిన రెండు సచివాలయ భవనాలను శనివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభిస్తారని ఆ గ్రామ సర్పంచ్ కుంచే వీరమణి ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో సచివాలయం రూ. 40 లక్షలు, రెండో సచివాలయం రూ. 43.60 లక్షలతో నిర్మించటం జరిగిందన్నారు. గ్రామానికి చెందిన కూటమి నేతలంతా హాజరుకావాలని ఆమె కోరారు.

రేపు అఖిల పక్ష కమిటీ సమావేశం

మండపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) కోనసీమ జిల్లా నుంచి మండపేట నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరం జిల్లాలో కలిపే దానిపై ఈనెల 10న అఖిల పక్ష కమిటీ నేతృత్వంలో కపిలేశ్వరపురం మండలం అంగర, రాయవరం మండలంలో మండల స్థాయి ప్రజాప్రతినిధులు, ప్రజలతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు అఖిల పక్ష కమిటీ చైర్మన్ కామన ప్రభాకరరావు తెలిపారు. ఆ రోజు ఉదయం కపిలేశ్వరపురం మండలం అంగరలో వున్న కలాణ మండపం, అదేరోజు రాయవరం మండలం రాయవరంలో వున్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయం ప్రాంగణంలో సాయంత్రం నాలుగు గంటలకు సమావేశం జరుగుతుందని చెప్పారు. దీనికి అన్ని రాజకీయపార్టీలకు చెందిన నేతలతోపాటు ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరై తమ సూచనలు, సలహాలు అందజేశాలని ఆయన కోరారు.

కపిలేశ్వరపురం: అంగర శ్రీ సిద్దార్థ కాలేజీకి ఎదురుగా ఉన్న వీరవెంకట సత్యనారాయణ ఫంక్షన్‌హాలులో ఆదివారం ఉదయం 10.30 గంటలకు నియోజకవర్గ అఖిలపక్ష నేతలతో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు మండపేట నియోజకవర్గ అఖిలపక్ష కమిటీ చైర్మన్ కామన ప్రభాకరరావు తెలిపారు. మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కలపాలన్న ఆలోచనతో దీన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, మేధావులు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు, పాత్రికేయ మిత్రులు పాల్గొని మీమీ సలహాలు, సూచనలు ఇచ్చి జయప్రదం చేయాలని కోరారు.


కపిలేశ్వరపురంలో వెలసిన దుకాణాలు

రాఖీ దుకాణాలు వెలవెల

కపిలేశ్వరపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వ్యాపారాలు లేక రాఖీ దుకాణాలు వెలవెలబోతున్నాయి. కపిలేశ్వరపురం, అంగర, టేకి, కోరుమిల్లి, వల్లూరు, తదితర గ్రామాల్లో ఈ దుకాణాలను ఏర్పాటు చేశారు. కపిలేశ్వరపురంలో ఎస్. రాము అనే దుకాణదారుడు రూ. 20 వేలతో రాఖీలు కొనుగోలు చేస్తే, కనీసం రూ. ఐదు వేలు కూడా అమ్మే పరిస్థితి లేదని వాపోయాడు. అలాగే మేఘన మాట్లాడుతూ రూ. 10 వేలు పెట్టి కొన్న రాఖీలు కనీసం వెయ్యికి కూడా అమ్మే పరిస్థితి లేదంటూ ఆవేదన వ్యక్తం చేసింది. ఆన్‌లైన్ వ్యాపారాలకు జనాలు ఎగబడటం వల్ల ఈ పరిస్థితి వచ్చిందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మండపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కేశవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల కేశవరంలో శనివారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మెయింట్‌నెన్స్ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని విద్యుత్ శాఖ ఈఈ కే. రత్నాలరావు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


అంగరలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు


పామర్రులో ..

మండపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణంతోపాటు రూరల్ గ్రామాల్లో మూడో శ్రావణశుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ పూజలను మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, పిండివంటలు, పండ్లను నైవేద్యంగా సమర్పించారు. అలాగే అమ్మవారి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని వల్లూరివారి వీధిలో వున్న అమ్మవారు, వాసవీమాత, కలవపువ్వు సెంటర్‌లో వున్న అమ్మవారు, కొండపల్లివీధిలో వున్న అమ్మవారు, బూరుగుంట రామాలయంలో వేంచేసియున్న అమ్మవారు, తదితర ఆలయాలతో పాటు మండపేట రూరల్‌లోని ద్వారపూడి, కేశవరం, ఏడిద, పాలతోడు, వెలగతోడు, తాపేశ్వరం, తదితర గ్రామాల్లోనూ శ్రావణమాస పూజలు జరిగాయి.

కపిలేశ్వరపురం: మండలంలోని పలుగ్రామాల్లో శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ దేవి వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఈ సందర్భంగా మహిళలు వేకువ జామునే లేచి తలంటు స్నానమాచరించి ఇండ్ల గుమ్మాలను మామిడి తోరణాలతో అలంకరించారు. అనంతరం అధిక సంఖ్యలో మహిళలు ఆలయాలను సందర్శించి అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు.

కె.గంగవరం: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. మహిళలు వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించి, పూజా మందిరంలో వరలక్ష్మీదేవి చిత్రపటాలకు పిండి వంటలతో తయారు చేసిన నైవేద్యాలను పెట్టి ప్రత్యేక పూజలు చేశారు.

రాయవరం: శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వత్రాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వెదురుపాక విజయదుర్గాపీఠంలో పీఠాధిపతి గాడ్ కుమార్తె గాదే సత్యవెంకట కామేశ్వరి ఆధ్వర్యంలో గాడ్ కుటుంబ సభ్యులు సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. పీఠంలో జరిగిన కార్యక్రమంలో గాడ్ కుమార్తెలు బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, వాడ్రేవు సూర్య రాజ్యలక్ష్మీ, సీతారమ్మ, తదితరులు పాల్గొన్నారు. వాడవాడలా తమతమ ఇళ్ల వద్ద మహిళలచే వినాయకపూజ, గౌరీపూజ, వరలక్ష్మి అమ్మవారికి అష్టోత్తర, సహస్రనామాలతో సామూహిక కుంకుమ, పుష్పార్చనలు, నీరాజన మంత్రపుష్పాలు, మహా నివేదనభక్తులు జరిపారు. రాయవరం పార్వతి సమేత రాజరాజేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు విలపర్తి ఫణిధరశర్మ, శశిధరశర్మ ఆధ్వర్యంలో అమ్మవార్ని గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు.

అలాగే రాయవరం పోలమ్మ వారి ఆలయంతో పాటు, బస్టాండ్ సెంటర్‌లో ఉన్న అమ్మవారి ఆలయం, మాచవరం దేవిసెంటర్‌లో దుర్గాదేవి ఆలయం, పసలపూడి మహాలక్ష్మీదేవి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి.

ఘనంగా ఎమ్మెల్యే వేగుళ్ల జన్మదిన వేడుకలు


మండపేటలో కేకు కట్ చేస్తున్న కూటమి నేతలు

మండపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు జన్మదిన వేడుకలను శుక్రవారం ఆయన అభిమానులు పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో కేకు కట్ చేశారు. అనంతరం స్థానిక ధర్మగుండం చెరువు వద్ద వున్న మయూరి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పాలు, పండ్లను పంపిణీ చేశారు. పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు భోజనాలు పెట్టించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు మచ్చా నాగు, వాదా ప్రసాదరావు, కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి చంద్రశేఖర్, చింతలశ్రీను, కోఆప్షన్ సభ్యుడు షేక్‌ఇబ్రహీం, కొవ్వాడ అప్పన్నబాబు, గెడా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అలాగే అన్నవరం శ్రీవీరవెంకట సత్యనారాయణ స్వామి వారిని ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేదాశీర్వచనంతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు.

రాయవరం: పసలపూడిలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు జన్మదిన వేడుకలను శుక్రవారం టీడీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డి ప్రసాద్ పాల్గొని కేక్‌ను కట్ చేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులు, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. మాజీ జడ్పీటీసీ కర్రి వెంకటరెడ్డి, రామచంద్రపురం వాటర్ డీసీ చైర్మన్ నల్లమిల్లి సతీష్ రెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి సతీష్‌రెడ్డి, అనుసూరి శ్రీనివాస్, దొరబాబు, చింతా నర్సిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సత్తి వెంకట కృష్ణారెడ్డి, రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


రాయవరంలో..

మాలల సంక్షేమానికి కృషిచేద్దాం


నూతనంగా ఎన్నికైన మాల మహానాడు కార్యవర్గం ప్రమాణం చేస్తున్న దృశ్యం

కె.గంగవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు నూతన కార్యవర్గం పార్టీలకు అతీతంగా మాలల సంక్షేమానికి కృషి చేస్తామని ప్రమాణం చేశారు. ఈ ఎన్నిక గురువారం రాత్రి ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా ఈరెళ్ల రాజు, ఉపాధ్యక్షుడిగా తోకల శ్రీను, గునుపే దొరబాబు, గౌరవాధ్యక్షుడిగా పెట్టా శ్రీనివాసరావు, రవ్వా భూషణం, తరపట్ల ఆనందరావు, ప్రధాన కార్యదర్శిగా దానం వెంకన్న, ట్రెజరర్‌గా తోకల వెంకటరమణ, సంయుక్త కార్యదర్శులుగా ధార సత్యనారాయణ, ఇనుకోటి వెంకటరమణ, కాటే సంజీవ్, పెట్టా రాజేష్, ప్రత్యేక ఆహ్వానితులుగా పాము భాస్కరరావు, సాదే నారాయణరావు, బత్తుల అప్పారావు, మొగమాటి చిట్టిరాజు, కాటే సుబ్రహ్మణ్యం, దున్న అన్నవరంను ఎన్నుకున్నారు.

గంగవరంలో మెగా వైద్యశిబిరం


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

కె.గంగవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కె.గంగవరంలో శుక్రవారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీన్ని రోటరీ క్లబ్ కాకినాడ ప్రెసిడెంట్ తాడాల బుజ్జి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. శిబిరంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, కంటి, దంత, సుగర్, బీపీ వంటి పరీక్షలు నిర్వహించారు. మహిళలకు సంబంధించిన పలురకాల సమస్యలకు గైనకాలజిస్టులతో పరీక్షలు చేయించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కాకినాడ ట్రినిటీ ఆసుపత్రి వైద్యులు గౌతమ్, డాక్టర్ మోహన్ విజయకుమార్, విద్యాసాగర్, శ్రావణ్ వంశీ, ఎస్.అంకిత, జ్యోప్రదీప్, సందీప్ పాల్గొని వైద్యసేవలు అందించారు. గంగవరం, తామరపల్లి, కోట, దంగేరు, కుందూరు, తదితర గ్రామాల ప్రజలు వైద్యసేవలు పొందారు. శిబిరంలో కూటమి నాయకులు చిర్రా రాజ్‌కుమార్, మల్లిపూడి బుజ్జి, తాడాల రాంబాబు పేరాబత్తుల నాగేశ్వరరావు, భాను, అల్లూరి దొరబాబు, ఇనకొండ రాజు, తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయంలో అష్టోత్తర పూజలు


ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,19,143 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అలాగే వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి మండపేట మండలం వెలగతోడుకు చెందిన వడ్డర్తి మంగాబేబీసరోజ, యశ్వంత్‌కిరణ్‌కుమార్ రూ.1.16 లక్షలు విరాళం సమర్పించారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం అందజేశారు.


దాతకు స్వామివారి చిత్రపటం అందజేత

రాఖీ పౌర్ణమికి ఏర్పాట్లు..

శ్రావణ శనివారం శ్రవణ నక్షత్రం, రాఖీ పౌర్ణమి సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి భక్తుల తాకిడి అధికంగా ఉండొచ్చన్న అంచనాలతో ఏర్పాట్లు చేపడుతున్నారు. ప్రత్యేక షామియానాలు, రోడ్లపై టెంట్లు, లైన్ల పెంపుదల, మెడికల్ క్యాంపులు ఏర్పాటు, తాగునీరు సౌకర్యం, ప్రదక్షిణలు నిర్వహించే మాడవీధుల్లో ఫ్యాన్లు, లైన్ల వద్ద కూల ర్లు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పార్కింగ్ వద్ద టాయిలెట్ల ఏర్పాట్లు తదితర సౌకర్యాలపై వివిధ శాఖల అధికారులతో డిప్యూటీ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షించారు. గోదావరిలో వరదనీరు ఉండడంతో పుష్కరఘాట్‌లోకి భక్తులు దిగి స్నానాలు ఆచరించకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి నదీలోకి వెళ్లకుండా గేట్లు ఏర్పాటు చేశారు. మరో ఘాట్‌లో భక్తులు స్నానం ఆచరించేందుకు జల్లు స్నానం ఏర్పాట్లను నిర్వహించారు. బందోబస్తు పెంపుదల చేస్తున్నట్టు డిప్యూటీ కమిషనరు వివరించారు. భక్తుల రద్దీకి తగినట్టు ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు.


పుష్కరఘాట్‌లోకి వెళ్లకుండా ఏర్పాటు చేసిన గేట్

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం

అమ్మవారి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు
ముత్తైదువులకు వాయినాలు


ఆలమూరులో సంతోషిమాతను దర్శించుకుంటున్న భక్తులు

ఆలమూరు/ఆత్రేయపురం/కొత్తపేట/రావులపాలెం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మి వ్రతాన్ని ఇంటింటా మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇళ్లలోని పూజా మందిరాలను ప్రత్యేకంగా అలంకరించుకుని వ్రతాన్ని ఆచరించారు.లక్ష్మీదేవిని పూజించారు. ఫలాలు, కలువపువ్వులు, బంగారు రూపులతో వరలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ముత్తైదువులు వాయినాలు అందిం చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆల యాలు మహిళా భక్తులతో కిటకిటలాడాయి. ఆలమూరులో సంతోషిమాత ఆలయాన్ని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు.


వెలిచేరులో వ్రతం ఆచరిస్తున్న మహిళ


కొత్తపేటలో వ్రతం ఆచరిస్తున్న మహిళలు


పూర్ణాలంకరణలో కనకదుర్గమ్మ

మాణిక్యాంబకు విశేష పూజలు

ద్రాక్షారామ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ద్వాదశశక్తి పీఠం మాణిక్యాంబమాతకు ఆలయార్చకులు ప్రత్యేక అలంకరణ చేసి మంత్రోచ్చారణతో విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

రాజవరంలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు


పేరవరంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న సారా, సామగ్రి

ఆత్రేయపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజవరంలో శుక్రవారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఆధ్వర్యంలో రూరల్ సీఐ విద్యాసాగర్ 25 మంది పోలీసులతో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎటువంటి రికార్డులు లేని 20 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఓ మహిళ ఇంటి వద్ద 400 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసి, 20 లీటర్ల సారా, డ్రమ్‌లను స్వాధీనం చేసుకుని ఆమెను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. సారా, గంజాయి, వంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నట్టు తెలిపారు. సీజ్ చేసి వాటిలోని వాహనాలు రికార్డులు సక్రమంగా ఉంటే వాటిని పోలీసులకు చూపించి తీసుకెళ్లవచ్చని, లేకపోతే ఆర్టీవోకి అప్పగిస్తామన్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు ఎస్.రాము, సురేంద్ర, నరేంద్రలతో పాటు పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ నూతన కార్యవర్గం

మామిడికుదురు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మామిడికుదురు మండల బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘానికి నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు.మండలాధ్యక్షుడిగా నైనాల రఘు రామయ్య, ప్రధాన కార్యదర్శిగా గెడ్డాడ నాగేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శిగా జగతాడి రామకృష్ణ సోమరాజు, ఉపాధ్యక్షులుగా కాట్రాడి వెర్రియ్య, బాలం రామకృష్ణ, గుత్తుల శ్రీనివాస్ ఇంకా సభ్యులను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల అధికారిగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కా వీరవెంకటేశ్వరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కె.వెంకటనరసింహరాజు, కడలి వెంకటేశ్వర్లు, రాయుడు నాగేశ్వరావు, పాల సోమేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



ద్వారపూడిలో కార్డెన్‌సెర్చ్

మండపేట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి పరిధిలోని వేములపల్లిలో శుక్రవారం మండపేట రూరల్ సీఐ పీతల దొరరాజు సారథ్యంలో మండపేట రూరల్, కపిలేశ్వరపురం,రాయవరం ఎస్ఐలు,సిబ్బందితో సంయుక్తంగా కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఇందులో రికార్డులు లేని పలు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ప్రజలను హెచ్చరించారు. అపరిచిత వ్యక్తులు ఎవరైనా కనబడితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు కిశోర్, సురేష్‌బాబు, హరీష్ పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ దొరరాజు

కేశవస్వామి ఆలయ ట్రస్ట్‌కు నోటిఫికేషన్

ఆత్రేయపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పురాణ ప్రసిద్ధి గాంచిన ర్యాలి జగన్మోహిని కేశవ స్వామి ఆలయ నూతన ధర్మకర్తల మండలి నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్టు కార్యనిర్వహణాధికారి బీహెచ్‌వీ రమణమూర్తి తెలిపారు. ఆలయానికి 11 మంది ధర్మకర్తలు నియమించాల్సి ఉందన్నారు. వారిలో ఐదుగురు మహిళలు విధిగా ఉండాలి. ఓసీల నుంచి ఐదుగురు(ఒకరు ఎక్స్ అఫీషియో (అర్చకుడు)), నలుగురు బీసీలు(ఒకరు నాయీ బ్రాహ్మణ విధిగా ఉండాలి), ఎస్సీ, ఎస్టీ నుంచి ఇద్దరు ఎంపిక చేయాల్సి ఉందన్నారు. 30 ఏళ్లు పైబడి, హిందువై, సంప్రదాయాలను పాటించి పూర్తి ఆరోగ్యులైన వారు తమ దరఖాస్తులను దేవాదాయ శాఖ సహాయ కమిషనరు, అమలాపురానికి 20 రోజుల లోపు అందించాలని కార్యనిర్వహణాధికారి తెలిపారు.

శనేశ్వర ఆలయానికి..

కొత్తపేట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధి చెందిన మందపల్లి మందేశ్వర(శనేశ్వర)స్వామి నూతన ధర్మకర్తల మండలి నియమించేందుకు దేవదాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసినట్టు ఆలయ సహాయ కమిషనరు దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు దేవాదాయ కమిషనరు నుంచి ఉత్తర్వులు వచ్చినట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులను ఫారం-2 ప్రకారం నోటిఫికేషన్ జారీ చేసిన 20 రోజుల వ్యవధిలో కార్యాలయానికి పంపాలన్నారు.

వాకిట్లోకి మురుగునీరు

- దుర్గంధంలోనే ఆవాసం
- రోగాల బారినపడే ప్రమాదం
- సిద్ధార్థనగర్ ప్రాంత వాసుల దుస్థితి


గోపాలపురం సిద్ధార్థనగర్‌లో వాకిళ్లలోకి చేరిన మురుగునీరు

రావులపాలెం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నిత్యం చిన్నపిల్లలు, వృద్ధులతో పాటు ఆ కాలనీ వాసులంతా రాకపోకలు సాగించే రహదారిలోకి మురుగునీరు వచ్చి చేరడంతో కంపుకొడుతోంది. రావులపాలెం మండలం గోపాలపురం సిద్ధార్థనగర్ ప్రాంత వాసులు ఇళ్ల ముందుకు మురుగునీరు చేరడంతో ఆ దుర్గంధంలోనే ఆవాసం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోగాల బారిన పడే ప్రమాదం పొంచి ఉన్నా శాశ్వత పరిష్కార దిశగా అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవంటూ ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. ప్రధానంగా గోపాలపురం ప్రధాన పంటకాలువలో నీరు పుష్కలంగా ప్రవహిస్తున్న సమయంలోను, కొద్దిపాటి వర్షానికి ఈ ప్రాంతంలోని మురుగు డ్రైను కొన్నేళ్లుగా పొంగి ప్రవహించడం షరామామూలు అయ్యింది. దీంతో ఈ మురుగు ఇళ్ల వాకిళ్ల ముందుకు చేరుతుంది. మురుగు డ్రెయిన్ పొంగిన సమయంలో దాంట్లోని వ్యర్థాలు రహదారిపైకి వచ్చి చేరడంతో దుర్గంధం వస్తోంది. ఈ మురుగునీటి కారణంగా దోమల బెడద పెరిగి రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు.


రోడ్డుపై నిలిచి ఉన్న మురుగు నీరు